Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 193 పేజీలు 8 వెల : 5 ఆదివారం 01 ఫిబ్రవరి 2026





## కరీంనగర్ మేయర్ సీటు మాదే



కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా

కరీంనగర్: కరీంనగర్ మేయర్‌తో పాటు మూడు చైర్మన్ పీఠాలు తమవేనని బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ,కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంచార్జ్‌లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు సమావేశంలో బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే మా లక్ష్యం. గెలిచే చోట కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం. గెలిచే అవకాశం లేనిచోట మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లుటిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం. తొందరపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. తప్పుడు ప్రచారాలు నమ్మకండి. డివిజన్లలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలిపించండి' అని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన పక్రియ కొనసాగింది. శనివారం డివిజన్ల వారీగా వచ్చిన నామినేషన్లను వేరు చేసి ఒక్కొక్కటిగా రిటర్నింగ్, సహాయ అధికారులు పరిశీలించారు. మొత్తం 1,257 నామినేషన్లు వచ్చాయి. దీనికి 736 మంది దరఖాస్తు చేశారు.



## ఎపిలో రెడ్ బుక్ రాజ్యాంగమే నడుస్తోంది

చట్టాలకు పాతరేసి పానల చేస్తున్నారు

లడ్డూలో కల్తీ లేదన్న అబద్దాలు ప్రచారం చేస్తారా

నన్ను తిట్టిన వారిని మాత్రమే తిట్టాను..చంద్రబాబును కాదు

వైకాపా నేత అంబటి రాంబాబు వివరణ

2లో..



## అవినీతి మూలాల్లో పుట్టిన పార్టీ వైసిపి

కల్తీ నెయ్యి విషయంలో ఇంకా అసత్య ప్రచారాలు

భీమవరం పర్యటనలో మంత్రి గొట్టిపాటి విమర్శలు

2లో..



డిజిటల్ లైబ్రరీ, కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను కుప్పంలో ఏర్పాటు చేయటానికి కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ నిధులు అందజేసిందని చెప్పారు. ఈ సెంటర్ ద్వారా విద్యార్థులు, ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారు, చిన్న వ్యాపారవేత్తలు, ఫ్రీలాన్సర్లు లబ్ది పొందుతారని వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని పేద కుటుంబాల వారికి ఇది ఎంతో ఉపయోగపడు తుందన్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ యక్ట్‌తో నల్లచట్టం

రాష్ట్రాన్ని ఐదేళ్లు పట్టి పీడించిన జగన్

పాస్ పుస్తకాలపై, రాళ్లపై జగన్ ఫోటోలు

అందుకోసం 700 కోట్లు తగలేశారు

కుప్పం పర్యటనలో

మండిపడ్డ సిఎం చంద్రబాబు

గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నల్ల చట్టాన్ని.. తాము అధికారంలోకి రాగానే రద్దు చేశామని.. గత ప్రభుత్వంలో జరిగిన సర్వే తప్పిదాలను సరి చేస్తున్నామని తెలిపారు.. దేశంలోని ఏ రాష్ట్రమూ ఇవ్వనంత స్థాయిలో పెన్షన్ల ద్వారా సంక్షేమం అందిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. 'ప్రతి నెలా రూ. 2,730 కోట్ల మేర పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. పెన్షన్ల కోసం తమిళనాడులో రూ. 315 కోట్లు, కర్ణాటకలో రూ. 392 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

కుప్పంలో 5,555 ఈ-సైకిళ్లు పంపిణీ గిన్నిస్ రికార్డుకెక్కిన కార్యక్రమంసైకిల్‌పై ప్రజావేదిక వద్దకు చేరిక



## రూ.1.07 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన

కాలుష్యరహిత నగరంగా నెల్లూరు: మంత్రి నారాయణ

నెల్లూరు: జిల్లా అభివృద్ధికి మరో అడుగు పడింది. నెల్లూరులో ఎండ్ టు ఎండ్ రోడ్ల పనులకు రూ.11 కోట్ల 75 లక్షలు మంజూరైనట్లు మంత్రి నారాయణ తెలిపారు. రూ.1.07 కోట్లతో చేపట్టిన తొలి విడత రోడ్డు పనులకు మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం రామిరెడ్డి కాలువ ఆధునికీకరణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. నెల్లూరును కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు మొత్తం రూ.11 కోట్ల 75 లక్షలతో ఎండ్ టూ ఎండ్ రోడ్ల పనులు చేపట్టామని తెలిపారు. 96 ప్రాంతాల్లో ఈ పనులు జరుగుతున్నాయని.. మార్చి ఆఖరుకల్లా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. గరంలో శుభ్రత పెంపొందించేందుకు 28 స్వీపింగ్ మిషన్లను కేటాయించామని, రూ.20 కోట్లతో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి నారాయణ వివరించారు.

ముంపు ముప్పు నుంచి నెల్లూరును తప్పించేందుకు మాస్టర్ ప్లాన్‌తో ముందుకెళ్తున్నామని.. నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా రామిరెడ్డి కాలువ ఆధునికీరణ పనులను చేస్తున్నామని.. ఎవరికైనా నష్టం జరిగితే వెంటనే ప్రత్యామ్నాయం చూపిస్తామని తెలిపారు. అయితే కొంతమంది దీన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

## ట్యాపింగ్ చేయమని ఏ సిఎం చెప్పరు



సిద్దిపేట,: రాజకీయ నేతలకు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫోన్ నెంబర్లు ఇచ్చి ట్యాప్ చేయమని ఏ ముఖ్యమంత్రి కూడా చెప్పరని అన్నారు. రేవంత్ రెడ్డి అసలు సమస్యలను పక్కదారి పట్టించడం కోసం ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి అమర వీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ పేరుతో రెండేళ్ల నుంచి బీఆర్ఎస్‌పై వేధింపులు కొనసాగుతున్నాయి. తెలంగాణలో సమస్యలను పక్క దారి పట్టించి.. అలీబాబా 40దొంగలు తరహాలో కాంగ్రెస్ నాయకులు అనేక కుంభకోణాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కడం కోసం సిట్ పేరిట కుట్రలు కొనసాగుతున్నారు. రాజకీయ నాయకులకు ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం ఉండదు. 1875లోనే ట్యాపింగ్‌పై చట్టం వచ్చింది.ఏ ముఖ్యమంత్రి కూడా ట్యాపింగ్ చేయమని ఎవరికి చెప్పరు. ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసం సిట్ వేశారు. విచారణ జరుగుతున్న క్రమంలో వ్యక్తిగత హననం చేసేలా మీడియాకి లీకులు ఇస్తున్నారు. కాంగ్రెస్ కుట్రల నుండి కేసీఆర్ తెలంగాణ తేవడమే నేరమా?. రేవంత్ రెడ్డి కక్షతోనే కేసీఆర్‌కి నోటీసులు ఇస్తూ వేధిస్తున్నారు. రాష్ట్ర మంత్రులు సమ్మక్క సారలమ్మ జాతరకి రమ్మని ఎర్రవెల్లికి వెళ్ళి ఆహ్వానిస్తారు. కానీ, పోలీస్ అధికారులు నంది నగర్ ఇంటి వెళ్లి నోటీసులు ఇస్తారు. ఇది దుర్మార్గమైన చర్య. ప్రతీకార వాంఛతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. ఎలక్షన్ అఫిడవిట్‌లో హరీష్ రావు అడ్రస్ సిద్దిపేటలో ఉంటే హైదరాబాద్ ఇంటి అడ్రస్‌కి నోటీస్ ఇచ్చారు. కేసీఆర్‌కి మాత్రం హైదరాబాద్‌లో నోటీస్ ఇచ్చారు.



## గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

స్థానికంగా గెలిచే వారికే పార్టీ అండ

రెబల్స్ బెడద లేకుండా చూసుకోండి

కాంగ్రెస్ నేతలకు సూచించిన సిఎం రేవంత్

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టా త్మకంగా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలను కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.


నామినేషన్ల పక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు.

## దేవదేవుడికి అపచారం చేసి అబద్దాలా

కల్తీ జరగలేదని ఇంకా దబాయింపులా

వైసిపి మూల్యం చెల్లించుకోక తప్పదు

సంబరాలు చేసుకోవడంపై మండిపడ్డ మంత్రి కేశవ్



2లో..

## నోటీసు అక్రమం

నేరుగా నోటీసులు ఇవ్వకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారు



సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు

నందినగర్ ఇంటికి నోటీసులు ఎలా అతికిస్తారు

అయినా మీకు విచారించే అధికారం లేదు

ఎర్రవెల్లిలో అందుబాటులో ఉంటానని చెప్పాను

ఎసిపికి తనను విచారించే అధికారమే లేదు జూబ్లీహిల్స్ ఎసిపికి మాజీ సిఎం కెసిఆర్ లేఖ నేటి విచారణకు అందుబాటులో ఉంటానని వెల్లడి

2లో..

గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశిరచిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది'

# ఏపిలో రెడ్ బుక్ రాజ్యాంగమే నడుస్తోంది

గుంటూరు: ఏపీలో చట్టం లేదని, రెడ్‌బుక్ పరిపాలన మాత్రమే కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యాంగమే నడుస్తుందని ఆయన మండిపడ్డారు. శనివారం గుంటూరులో మీడియాతో మాట్లాడిన అంబటి.. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూలో జంతువులు కొవ్వు కలిసిందని చంద్రబాబు అన్నారు. ఎలాంటి కల్తీ జరగలేదని సీబీఐ నివేదిక చెప్పింది. టీడీపీ మళ్లీ దుష్ప్రచారం చేస్తూ మళ్లీ ఫ్లెక్సీలు పెట్టింది. ఆ ఫ్లెక్సీలు తీసేయమని చెప్పా. నన్ను బూతులు తిడుతూ నానా హంగామా చేశారు. నన్ను తిట్టిన వారిని మాత్రమే తిట్టా. నేను చంద్రబాబున బూతులు తిట్టలేదు. నేను తిట్టి ఉండాల్సింది కాదు.. కానీ ఆవేశంలో తిట్టేశా. నన్ను తిట్టిన వాళ్లను తిట్టడం నా అంతరాత్మకు తప్పనిపించింది. కేసు పెట్టుకుంటే పెట్టుకోండి.. అరెస్ట్ చేస్తే చేసుకోండి. రాష్ట్రంలో పోలీసు రాజ్యాంగం నడుస్తోంది నేను అరెస్టుకు సిద్ధం. నాపై దాడికి యత్నించిన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెడ్‌బుక్‌కు నా కుక్క కూడా భయపడదు. నాపై దాడి చేస్తుంటే పోలీసులు మాత్రం? చోద్యం చూస్తున్నారు. పోలీసుల సమక్షంలోనే టీడీపీ గూండాలు దాడికి యత్నించారు. ఏపీలో చట్టం లేదు.. రెడ్‌బుక్ పాలనే నడుస్తోంది' అని అంబటి రాంబాబు మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత అంబటిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో తనపై వ్యక్తమవుతున్న విమర్శలపై తాజాగా అంబటి స్పందించారు. తాను అలా మాట్లాడకుండా ఉండాల్సిందని అంబటి వ్యాఖ్యానించారు నేను చంద్రబాబును బూతులు తిట్టలేదు. చంద్రబాబును తిట్టాల్సిన అవసరం లేదు. రాజకీయ విమర్శ చేస్తాను. కార్యకర్తలను మాత్రం తిట్టకుండా ఉండాల్సింది. నన్ను చంపే ప్రయత్నం చేశారు. కర్రలు పట్టుకొని తిరిగిన వాళ్లను, నన్ను తిట్టే వాళ్ళని పోలీసులు ఆపగలిగారా. అరెస్టు చేస్తామని బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదు. అరెస్టుకు సిద్ధంగా ఉన్నాను. వాళ్ళు నన్ను తిట్టారు. నేను వాళ్లను తిట్టాను' అని అంబటి పేర్కొన్నారు. బూతులు మాట్లాడానన్న మనో వేదన నాలో ఉంది. అరెస్టుకు భయపడి నేను ఇలా మాట్లాడటం లేదు. ముందస్తు బెయిల్ కూడా తీసుకోను. చంద్రబాబు సంగతి తేలుస్తాను. లాయర్ గా ఉన్నాను. నాకు చట్టం తెలుసు నాకు. చంద్రబాబు, లోకేష్ అరెస్టు చేయమన్నారు.. పోలీసులు చేస్తున్నారు' అని అంబటి వ్యాఖ్యానించారు.

## అవినీతి మూలాల్లో పుట్టిన పార్టీ వైసిపి

భీమవరం: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి అవినీతి మూలాల్లోంచి పుట్టిన పార్టీ.. వైసీపీ అని ఎద్దేవా చేశారు. శనివారం భీమవరంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కడి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. తెలుగు ప్రజలకు గుర్తింపు తెచ్చిన ఏకైక వ్యక్తి దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యాఖ్యానించారు. మహిళలకు సమాన ఆస్తి హక్కు కల్పించి.. వారి సాధికారత కోసం ఎన్టీఆర్ కృషి చేశారని చెప్పుకొచ్చారు. సంక్షేమంలో ఎన్టీఆర్ స్ఫూర్తిని నేడు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ కొనసాగిస్తున్నారని తెలిపారు. వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తిరుమలకి ఉన్న గౌరవాన్ని వైసీపీ భ్రష్టుపట్టించిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ÷ర్ అయ్యారు. తిరుమల కల్తీ నెయ్యి విషయంలో వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని ఆగ్రహించారు. టీటీడీకి డిక్లరేషన్ సమర్పించడాన్ని జగన్ తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. 70 శాతం పూర్తయిన పోలవరాన్ని నాశనం చేశారని ÷ర్ అయ్యారు. ఆంధ్రులకు రాజధాని లేకుండా చేసిన దుర్మార్గుడు జగన్ మోహన్ రెడ్డి అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణ మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ పెట్టిన పార్టీ తెలుగుదేశం అని పేర్కొన్నారు. సంక్షేమంలో ఎన్టీఆర్ స్ఫూర్తిని నేడు చంద్రబాబు, లోకేశ్ కొనసాగిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చుతోంది. జగన్ అవినీతి మూలాల్లోంచి పుట్టిన పార్టీ వైకాపా. ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. తిరుపతి, తిరుమలకు ఉన్న గౌరవాన్ని ఆ పార్టీ భ్రష్టుపట్టించింది. తిరుమల కల్తీ నెయ్యి విషయంలో ఆ పార్టీ అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు.

## దేవదేవుడికి అపచారం చేసి అబద్ధాలా

అమరావతి:కోట్లాదిమంది హిందువుల నమ్మకాన్ని దెబ్బతీసి, కల్తీ నెయ్యితో లడ్డూలను తయారు చేయించి అక్రమాలకు పాల్పడ్డ వైకాపాను దేవుడు కూడా క్షమించడని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దేవుడి మీద వారికి విశ్వాసం లేకపోవచ్చుగానీ, భక్తులుగా మాకు విశ్వాసం ఉందని అన్నారు. టీటీడీ లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసీపీకి ఎలాంటి క్లీన్ చిట్ రాలేదని పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. వైసీపీ తమకు క్లీన్ చిట్ వచ్చినట్లు చేసుకుంటున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, దేవదేవుడి విషయంలో పాపం చేసి సంబరాలు చేసుకోవడానికి ఆ పార్టీ నేతలకు సిగ్గుండాలని విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం స్వామివారి లడ్డూ పవిత్రతను కాపాడేందుకు అనేక పకడ్బందీ నిబంధనలు పెట్టిందని.. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ నిబంధనలను సడలించి కల్తీకి బీజం వేసిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే 2022లో సీఎఫ్‌టీఆర్ఐ నెయ్యి పేరిట సరఫరా అయిన పదార్థాల్లో జంతు అవశేషాలు ఉన్నాయని నిర్ధారించిందని.. ఆ నివేదికను నాటి వైసీపీ ప్రభుత్వం తొక్కిపెట్టడంతో పాటు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మంత్రి విమర్శించారు. దేవుడి ప్రసాదానికి ముడిసరకు పంపిణీని ఆర్థిక అంశంగా మాత్రమే గత పాలకులు చూశారన్నారు. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు హవాలా మార్గంలో వచ్చిన డబ్బు ఎవరెవరికి వెళ్లిందో తేలాల్సి ఉందన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ల్యాబ్ అయిన ఎన్‌డీడీబీ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు జంతు అవశేషాలు ఉన్నాయని నిర్ధారణ చేసిన అంశాన్నే సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారని.. ఇదే విషయం సిట్ అనుబంధ ఛార్జ్ షీట్ 35వ పేజీలో స్పష్టంగా ఉందని మంత్రి వివరించారు. వైసీపీ చెబుతున్నట్లుగా క్లీన్ చిట్ ఎక్కడ వచ్చిందో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని పయ్యావుల కేశవ్ డిమాండ్ చేశారు. చేసిన తప్పుకు క్షమాపణలు కోరాల్సింది పోయి, తప్పే జరగనట్లు ప్రజలను మోసం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. చేసిన పాపానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేస్తారా అంటూ ÷ర్ అయ్యారు. జరుగుతున్న విపరీత ప్రచారాలు చూసి తట్టుకోలేకే వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నామే తప్ప.. తిరుమల శ్రీవారి విషయంలో రాజకీయం చేసే ఉద్దేశం తమకు లేదని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. క్లీన్‌చీట్ అంటూ ఆ పార్టీ చేసుకునేది అసత్య ప్రచారమని మండిపడ్డారు. లడ్డూ పవిత్రతను కాపాడేందుకు తెదేపా ప్రభుత్వం అనేక నిబంధనలు ప్రవేశపెట్టింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక నిబంధనలు సడలించి కల్తీకి బీజం వేసింది. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు అంత తేలిగ్గా వదలిపెట్టరు.

# ల్యాండ్ టైటిలింగ్ యక్ట్‌తో నల్లచట్టం




చిత్తూరు:ఐదేళ్ల పాటు కొందరు రాష్ట్రాన్ని పట్టి పీడించారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంపర్ చేయలేని విధంగా ఆధునిక టెక్నాలజీ వినియోగించి, పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు'అది మీ భూమి, మీ ఆస్తి.. దానిపై జగన్ ఫొటో ఎందుకు' అని మండిపడ్డారు. కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం శాంతిపురం మండలం తుమ్మిసి వద్ద జరిగిన ప్రజావేదికపై ప్రసంగించారు. ప్రజల ఆస్తుల మీద ఫొటోలు వేసుకున్నారని మండిపడ్డారు. దుర్మార్గం చేసింది చాలక తన పాలనే బెటర్ అంటూ ఇప్పుడు జగన్ మాట్లాడుతున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలాక్సీ గ్రానైట్‌తో సర్వే రాళ్లు వేశారని, దానిపై బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. రాళ్లపై బొమ్మల కోసం రూ. 700 కోట్లు ఖర్చుపెట్టారని ఫైర్ అయ్యారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో నల్లచట్టం తెచ్చారని మండిపడ్డారు. భూ వివాదాలు వస్తే స్థానిక కోర్టులకు వెళ్లే అవకాశం లేకుండా చేశారని ఫైర్ అయ్యారు. ఇంత ఘోరమైన చట్టం చేసి తనదే చాలా గొప్ప చట్టం అంటూ బుకాయిస్తున్నారని దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నల్ల చట్టాన్ని.. తాము అధికారంలోకి రాగానే రద్దు చేశామని.. గత ప్రభుత్వంలో జరిగిన సర్వే తప్పిదాలను సరి చేస్తున్నామని తెలిపారు.. దేశంలోని ఏ రాష్ట్రమూ ఇవ్వనంత స్థాయిలో పెన్షన్ల ద్వారా సంక్షేమం అందిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. 'ప్రతి నెలా రూ. 2,730 కోట్ల మేర పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. పెన్షన్ల కోసం తమిళనాడులో రూ. 315 కోట్లు, కర్ణాటకలో రూ. 392 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఏపీలో పేదలకు ఏ స్థాయిలో పెన్షన్ అంద చేస్తున్నామో ప్రజలు ఆలోచించాలి. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయి. ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం ఇచ్చాం. దీపం-2.0 పథకం కింద గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. అన్ని రంగాల్లోనూ మహిళల భాగస్వామ్యం పెరగాలి. ఆడబిడ్డలకు సరైన ప్రాధాన్యం ఇచ్చింది తెలుగుదేశం పార్టీనే. ఆస్తిలో మహిళలకు ఎన్టీఆర్ సమాన హక్కు కల్పించారు. నేను 33 శాతం రిజర్వేషన్‌ను ఉద్యోగాలు, విద్యా రంగంలో అమలు చేశా' అని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. 33 శాతం చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు రాబోతున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. 'భవిష్యత్తులో మహిళలు పెద్ద ఎత్తున ఎంపీలు, ఎమ్మెల్యేలుగా అవుతారు. కుప్పం జలకళను సంతరించు కుంది. హంద్రీ - నీవాతో కాలువ ద్వారా కుప్పంలో అన్ని చెరువులూ కృష్ణా జలాలతో నిండాయి. హంద్రీ - నీవాతో అనంతపురానికి నీళ్లిచ్చాం. 10 లక్షల చెక్ డ్యాంలు నిర్మించాం. హంద్రీ - నీవా, గాలేరు - నగరితో సహా రాయలసీమ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. దేశంలో రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు ఉంది. దీన్ని రెట్టింపు చేసి 500 లక్షల మెట్రిక్ టన్నుల సాగు సాధిస్తాం. కూటమి ప్రభుత్వానికి వారసత్వ సమస్యలు ఉన్నాయి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### కుప్పంలో అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ

చిత్తూరు: చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీలోని స్వర్ణ నవదిశ సెంటర్‌లో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ, రాష్ట్రంలోనే మొదటి కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ కేంద్రం విద్యార్థులు, నిపుణులకు ఇంటర్నెట్, ఆన్‌లైన్ టెక్ట్స్ బుక్స్, డిజిటల్ కంటెంట్ వంటి సదుపాయాలను అందిస్తుంది. ఐటి అభివృద్ధికి సాంకేతికతకు కుప్పంను ఒక వేదికగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. యువత, కొత్తగా స్టార్టప్‌లు పెట్టే వారికి తక్కువ ఖర్చుతో ఆఫీసు వాతావరణం కల్పించడం, డిజిటల్ చదువులను ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. కుప్పంలో ఇంత మంచి కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించటం ఎంతో సంతోషంగా ఉందని మన్నవ మోహనకృష్ణ తెలిపారు. యువతకు ఉపయోగపడే ఇలాంటి అభివృద్ధి కార్యక్రమానికి తోడ్పాటు అందించిన ఏపీటీఎస్ ఛైర్మన్ మోహన కృష్ణను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అభినందించారు.

### కుప్పంలో 5,555 ఈ-సైకిళ్లు పంపిణీ

చిత్తూరు: కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబురెండో రోజు పర్యటన కొనసాగింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలకు ఈ-సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. నూతన చరిత్రకు కుప్పం నుంచి శ్రీకారం చుట్టాం. కుప్పంలో 5,555 ఈ-సైకిళ్లు పంపిణీ చేసి చరిత్ర సృష్టించాం. గిన్నిస్ రికార్డు వచ్చిందని కాదు.. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయి. ఇంటిపై ఉత్పత్తయ్యే విద్యుత్‌తోనే సైకిల్‌కు ఛార్జింగ్ పెట్టుకోవచ్చు. ఈ సూపర్ సైకిల్.. పైసా ఖర్చు లేకుండానే దూసుకెళు ంది. సైకిల్‌కు ఓటేశారు.. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం అని సీఎం చంద్రబాబు అన్నారు. అంతకుముందు శివపురం నుంచి ప్రజావేదిక వరకు ఈ-సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో చంద్రబాబు పాల్గొని దాదాపు 3 కి.మీ ఈ-సైకిల్‌పై వచ్చారు. 5,555 ఈ-సైకిళ్ల పంపిణీ చేపట్టి చిత్తూరు జిల్లా గిన్నిస్ రికార్డు సాధించింది. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు ప్రకటించారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు పత్రాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్ అందుకున్నారు. కుప్పంలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన బిజీబిజీగా సాగుతోంది. రెండో రోజు శనివారం ఉదయం కడపల్లిలోని తన నివాసంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం ఉదయం 10:00 గంటలకు గుడిపల్లి మండలం బెగ్గిలపల్లెలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసారు. ఆ తర్వాత 11:00 గంటలకు శాంతిపురం మండలం తుమ్మిసి మోడల్ స్కూల్ సమీపంలో 'ఈ-సైకిల్ పంపిణీ-గిన్నిస్ వరల్డ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. తుమ్మిసి వద్ద జరిగే బహిరంగ సభ కార్యక్రమం వేదిక వరకు కిలోమీటర్ మేర ఈ-సైకిల్‌పై చంద్రబాబు వెళ్లారు. మధ్యాహ్నం 2:00 గంటలకు ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ కంపెనీల స్టాళ్లను ఆయన పరిశీలించారు..కుప్పం పర్యటన నిమిత్తం.. శుక్రవారమే చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం కుప్పం నుంచి రాజధాని అమరావతికి బయల్దేరనున్నారు.

# నోటీసు అక్రమం



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని మాజీ సిఎం కేసీఆర్ పేర్కొన్నారు. నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆరు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. క్రైమ్ నంబర్ 243/2024 విచారణకు సంబంధించి తన వివరణను ఈ లేఖలో వివరించారు. ముఖ్యంగా నందినగర్ నివాసం గోడపై నోటీసు అతికించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ స్పష్టం చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను.. వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి నివాసంలో ఉంటున్నానని, అక్కడే విచారణ జరపాలని పోలీసులకు స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసు తీర్పును లేఖలో ఉటంకించారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకు, సీఆర్పీసీ సెక్షన్ 160 కింద జారీ చేసే నోటీసులకు ఎలాంటి సంబంధం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాలోనే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం స్పష్టంగా చెబుతోందని తెలిపారు. హరీష్ రావుకు జారీ చేసిన నోటీసుల విషయంలో పోలీసులు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. ఈ తరహా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని హెచ్చరించారు. పోలీసుల తీరు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తి సహకారం అందిస్తానని కేసీఆర్ వెల్లడించారు. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నందినగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అక్రమ పద్ధతిలో జారీ చేసిన నోటీసులను విస్మరించే హక్కు తనకు ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తనకు సంబంధించిన నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచించారు. అలాగే ఏపీ హైకోర్టులోని వీడీ మూర్తి కేసు తీర్పును కూడా లేఖలో ప్రస్తావించారు. చట్టపరమైన అభ్యంతరాలున్నా తాను విచారణలో సిట్‌కు సహకరిస్తానని చెప్పారు. సిట్ పోలీసుల వైఖరి కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని తెలిపారు. పోలీసుల తీరు నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని వెల్లడించారు. కేసీఆర్ లేఖలో ఏం రాశారంటే.. 'సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకి వ్యతిరేకం. సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కిన సిట్ అధికారుల తీరు. సిట్ అధికారులకి నోటీసు ఇచ్చే అధికారమే లేదు. ఇది నా రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. మొన్న రెండుసార్లు సిట్ అధికారులు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధం, చట్టాలను అతిక్రమించి ఇచ్చారు. మీరు ఇచ్చిన మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల వేరే రోజు విచారణకు తేదీ ఇవ్వాలని చెప్పాను. దాంతోపాటు 65 ఏళ్ల పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 అసఖఅ నిబంధనలను మీ దృష్టికి తెచ్చాను' అని పేర్కొన్నారు. 'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది. ఆ లేఖ మీరే పంపినట్లయితే, మీ సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నాను. ఇది భారత రాజ్యాంగం, చట్టం, గౌరవ సుప్రీంకోర్టుల పట్ల మీకు ఏమాత్రం గౌరవం లేదు అనే విషయాన్ని సూచిస్తుంది. గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశించిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది' అని కేసీఆర్ తన లేఖలో సూచించారు. 'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘించడమే. నేను మీ పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుతో నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎలక్షన్ అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారు అన్నదే ముఖ్యం. నేను కొన్ని సంవత్సరాలుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నాను అన్నది నిర్వివాద అంశం. అక్కడే నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది' అని పేర్కొన్నారు.

# గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

హైదరాబాద్: వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గోదావరి నది తీరంలో దాదాపు 69 ప్రాంతాలలో 74 పుష్కర ఘాట్లను గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి తగు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఈ రోజు రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్ లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, పరిపాలన వ్యవస్థ పై సమీక్షించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, వేములవాడ, భక్తుల రద్దీ ఉండే ఇతర ఆలయాల్లో దర్శన క్యూల నిర్వహణ, పార్కింగ్, త్రాగునీరు, టాయిలేట్స్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షా సమావేశంలో భూ భారతి రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు, భూ సర్వేలు, సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇ-ఫైలింగ్, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన, తదితర అంశాలపై సమీక్షించారు. క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సెట్విన్, రాష్ట్ర మ్యూజియమ్స్ అభివృద్ధి,
ఆయా శాఖల పనితీరుపై
సి.ఎస్ సమీక్షించారు. ప్రస్తుత కార్యక్రమాల అమలు స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల, తెలంగాణ 2047 విజన్
లక్ష్య సాధన పై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడాకారులను అధిక సంఖ్యలో తయారు చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ విధంగా క్రీడల అభివృద్ధికి యువతను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల వైపు మరింత ఆకర్షించే విధంగా విధానాలను రూపొందించాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు.

# కూటమి ప్రభుత్వ పథకాలతో ప్రజలకు లబ్ది

## ఒక రోజు ముందుగా పెన్షన్ ల పంపిణి

### పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్

**కర్నూలు , జనవరి 31:- ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**





కూటమి ప్రభుత్వం కు ప్రజలు ముఖ్యమని ప్రభుత్వ పథకాలను అమలు చేసి ప్రజలకు లబ్ది చేస్తుందని, వాణిజ్యం , పరిశ్రమలు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సందర్భంగా పేర్కొన్నారు. శనివారం ఉదయం మంత్రి 52వ వార్డు కొండారెడ్డి బురుజు దగ్గర నుండి సాయిబాబా గుడి వరకు ఉన్న 15 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు విచారించి మాల శ్రీనివాసులు , చిన్న ఖాసీం లకు వికలాంగుల పెన్షన్ ను.. మీనాక్షి , నాగమని లకు వితంతు మరియు ఇతరులకు వృద్ధాప్య - ఒంటరి మహిళల పెన్షన్లను పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ విధంగా పని చేస్తున్నది అన్న విషయాలు మంత్రి వారిని ప్రశ్నించగా వారు మేము ఈ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నామన్న విషయం తెలియజేశారు. ప్రతినెలా టంచనుగా పెన్షన్ వస్తుందా అని మరియు మొత్తం పెన్షన్ ఇస్తున్నారు కదా అని కూడా అడిగారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... ఈ కుటమి ప్రభుత్వం ఒకటో తారీకు సెలవు దినమైనప్పుడు పెన్షన్ ను ఒక రోజు ముందుగానే అందజేస్తుందని , అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెయ్యి రూపాయల మొత్తాన్ని ఒకటేసారి పెంచి 4000 ఇస్తున్నామని తెలిపారు. వికలాంగులకు రూ 6,000 లు , మంచానికే పరిమితమైన వారికి 15 వేల వరకు పెన్షన్ అందజేస్తున్నామని భారతదేశంలో అత్యధిక సంఖ్యలో పెన్షన్ ఇస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం మాత్రమే అని , ప్రజలకు పథకాలు అన్నిటిని అమలు చేసి మంచి ప్రభుత్వం అన్న ప్రశంశ తెచ్చుకునిందని తెలిపారు. దేశంలోనే

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని మంత్రి టి.జి. భరత్ ప్రజలకు తెలియజేశారు. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం లో జరిగిన వివరాలు తెలుపుతూ భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల కంటే ఉత్తమంగా ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు ఆహ్వానించే కమిట్మెంట్ ను అక్కడ వ్యాపారస్తులకు తెలపడం జరిగిందని మంత్రి తెలియజేశారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి కర్నూలు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కొటాల్లో కంపచెట్లు తొలగింపు

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**



నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మండ్రా శివానందరెడ్డి మరియు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆదేశాల మేరకు టిడిపి పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవర్ధనగిరి శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని 15వ వార్డులోని బి ఆర్ ఆర్ నగర్ కొట్టాలలో నివాసాల రోడ్ల వెంట ఉన్నటువంటి కంపచెట్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కోరడంతో మున్సిపల్ కమిషనర్ స్పందించి మున్సిపల్ టికీ సంబంధించిన జె సి బి ద్వారా మూడు లైన్లు క్లియర్ చేయడం జరిగింది దీంతో కొట్టాల వాసులు ఎమ్మెల్యేకు స్థానిక టిడిపి నాయకులకు మున్సిపల్ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా విఆర్ఓ నగర్ కాలనీలోని డ్రైనేజీ కాలువల మరమ్మత్తుల కొరకు సంబంధిత అధికారుల చేత సర్వే చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, సచివాలయం అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ఓల్డ్ బి ఎస్ ఆర్ టీం రూ 5వేలు ఆర్థిక సహాయం

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**



వైస్సార్సీపీ యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నందికొట్కూరు నియోజకవర్గం లోని బాధ్యత కుటుంబాలకు అండగా ఉంటాడని నందికొట్కూరు పట్టణ వైసిపి ఓల్డ్ బిఎస్సార్ టీం పట్టణంలోని నీలి షికారిపేట లో నివాసం ఉన్న లక్ష్మీ అనే మహిళా అనారోగ్యం కారణంగా మరణించిన వారి

వైస్సార్సీపీ యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మెరకు రూ 5000/- ఆర్థిక సహయం మరణించిన కుటుంబానికి అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వైయస్సార్సిపి పట్టణ అధ్యక్షులు మన్సూరు ఓల్డ్.బి.ఎస్ ఆర్ లడ్డూ ,, సమియుల్లా మాభాష, గాంధీనగర్భాష ,,అబ్దుల్లా,అబ్దుల్ కరీం, తదితరులు పాల్గొన్నారు.

## నవోదయం 2.0 ద్వారా నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

**కర్నూలు , జనవరి 31:ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**



;నవోదయం 2.0 ద్వారా నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియం ప్రాంగణం లో నవోదయం 2.0 లో భాగంగా రెండవ విడత ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు సంబంధించి కర్నూలు నగరం బంగారుపేట వాసులు 20 మంది లబ్ధిదారులకు ఇండియన్ బ్యాంకు ద్వారా మంజూరైన ఆటోలు , తోపుడు బండ్లు , కంకర మిల్లర్ లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా బ్రతకాలని సూచించారు.. నాటు సారా తయారీ మాని, ముందుకు వచ్చిన వారిని అభినందిస్తూ, మంచిగా బ్రతకడానికి ఉపాధి అవసరమని, ప్రభుత్వం ఇచ్చిన ఉపాధిని వినియోగించుకుని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని లబ్ధిదారులను కోరారు. నియమిత వేగంతో ఆటోలను జాగ్రత్తగా భద్రతా నియమాలు పాటిస్తూ నడపాలని కోరారు. ఆటోలో ఎక్కువమందిని తీసుకుని వెళ్ళరాదని, ఎక్కువ పైకం వసూలు చేయరాదని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బంగారు పేట వాసులకు 20 లక్షల రూపాయల రుణాల చెక్కును అందజేశారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి మాట్లాడుతూ... బంగారు పేటలో ఇంకా మిగిలిపోయిన వారు నాటు సారా ని తయారు చేయడం ఆపివేసి సగౌరవంగా బ్రతికే జీవనోపాధిని ఆపాదించు కునే విధంగా ముందుకు రావాలని, అందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయం చేస్తుందని తెలియజేశారు. ఎక్సైజ్ సూపరింటెండ్ సుధీర్ బాబు మాట్లాడుతూ... కర్నూలు పట్టణం లో మెప్మా వారి సహాయంతో ఇండియన్ బ్యాంక్ అందించిన ఋణాలను ఎప్పటికప్పుడు కంతులు చెల్లించి, పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వాలని కోరారు. మెప్మా పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ... మెప్మా పట్టణ పేద ప్రజలకు అన్ని రకాల ఉపాధి కొరకు రుణాలు మంజూరు చేయటానికి సిద్ధంగా ఉంటుందని, దీనిని బంగారుపేట వాసులు వినియోగించుకోవాలని కోరారు.

ఈ సమావేశానికి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, మెప్మా పీడీ శ్రీనివాసులు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ , ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి అసలు సవాల్ ఇదే !

గత కొన్ని సంవత్సరాలుగా మసకబారిన ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ట ఇప్పుడిప్పుడే కాంతులీనుతున్నది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్రమంత్రి నారా లోకేష్ లు ఏడాదిన్నర కాలంగా విరామమెరుగక చేసిన కృషి ఫలించింది. దేశంలోనే అత్యధికంగా పెట్టుబడులు సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ వాటా 25.3 శాతంగా వున్నది. దేశంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న 10 రాష్ట్రాల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకొని 25.3 శాతం వాటా సాధించటం అంటే ఆషామాషీ కాదు. అందుకు చంద్రబాబు, లోకేష్ లను అభినందించాల్సిందే. తెలుగులో ఒక సామెత ఉంది. గుర్రాన్ని చెరువు వరకు తీసుకెళ్లగలం. కానీ బలవంతంగా నీరు తాగించలేం కదా. అదే తరహాలో పెట్టుబడులు, పారిశ్రామిక వేత్తలతో ఒప్పందాలు (ఎం వో యు) చేయించటం వరకు చంద్రబాబు, లోకేష్ లు సఫలీకృతులు అయ్యారు. అవన్నీ కార్యరూపం దాల్చాలంటే ముందుగా ఆయా సంస్థలకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ లు జరగాలి. భూ కేటాయింపులు జరగాలి. ఇతరత్రా పాలనా పరమైన అనుమతులు లభించాలి. ఇవన్నీ చేయాల్సిన బాధ్యత ' ఆర్థిక అభివృద్ధి మండలి (ఈడీబీ) దే.ఆ పెట్టుబడులను సాకారం చేయటం (పాలనా భాషలో కన్వర్షన్ చేయటం) ఇప్పుడు ప్రభుత్వం ముందున్న అసలైన సవాల్. మనం ఏదైనా కార్యక్రమానికి వెళ్లినప్పుడు అక్కడ ముందుగా ' రిసీవ్ ' చేసుకునే వారి తీరు మనపై ప్రభావం చూపుతుంది. అంటే ఎంట్రీ లెవెల్ లో రిసెప్షన్ బాగుండాలి అన్నమాట. అప్పుడే అక్కడకు వెళ్ళిన పని సాకారం అవుతుంది. అదేవిధంగా పెట్టుబడి దారులు, పారిశ్రామిక వేత్తలకు ఆంధ్రప్రదేశ్ లో ' ఈడీబీ 'అనేది ఎంట్రీ పాయింట్ వంటిది. అందుకే ఈడిబి లో సమర్థులైన, పారిశ్రామిక రంగంలో సుదీర్ఘ అనుభవమున్న వారిని నియమించటం ఆనవాయితీగా వస్తున్నది. 2024 లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈడీబీ ప్రాముఖ్యతను గుర్తించి సమర్థులైన యువ అధికారులను నియమించింది. అయితే ఏడాదిన్నర కాలంలోనే ఆ అధికారుల బదిలీ జరుగనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. బదిలీ అయిన వారి స్థానంలో 'యువ ' అనే కేటగిరీ లో మరో జూనియర్ అధికారిని నియమిస్తే పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చే ప్రమాదమున్నది. ఆ అధికారి ఎంతటి సమర్థత కలిగి ఉన్నప్పటికీ పెట్టుబడులు 'కన్వర్షన్' పై పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పరచుకోవాలంటే కనీసం రెండేళ్ల సమయం పడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అది ఏమాత్రం వాంఛనీయం కాదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈడీబీ లో పారిశ్రామిక రంగంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారుల సాధకబాధకాలు తెలిసిన వారికి బాధ్యతలు అప్పగిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. అప్పుడే పెట్టుబడులు సాకారం అయి, రాష్ట్ర ఆదాయం పెరగటం తో పాటు నారా లోకేష్ చెబుతున్న విధంగా 20 లక్షల మందికి ఉత్పాదక రంగంలోనే ఉద్యోగ కల్పన సాధ్యమవుతుంది. లేనిపక్షంలో చంద్రబాబు, నారా లోకేష్ ల శ్రమ బూడిదలో పోసిన పన్నీరయ్యే ప్రమాదమున్నది.

# నూతన డైరీనీ ఆవిష్కరించారు






**రాయలసీమ ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**

వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ 20 26 వ సంవత్సర కాలమాన పట్టిక నూతన డైరీనీ నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు సంయుక్త కలెక్టర్ తదితరులు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఉత్తేజిత స్టాప్ రిపోర్టర్ శివకుమార్ రెడ్డి సీనియర్ రిపోర్టర్ బుల్లెట్ శ్రీనివాసులు మరో రిపోర్టర్ సత్యనారాయణ వీరితోపాటు. నంద్యాల జిల్లా విలేకరులు సత్యం సింగ్ హుస్సేన్ అలాం తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గనియ మాట్లాడుతూ కలసికట్టుగా ఉండి మీ సమస్యలను మీరే పరిష్కరించుకోవాలని అన్నారు .అలాగే రాయలసీమ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ కలెక్టర్ గారు ఎవరైనా పాత్రికేయులు వారి సమస్యల పై మీద మీ దగ్గరికి వస్తే వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ మరియు జిల్లా రెవెన్యూ అధికారి పాల్గొన్నారు









## నంద్యాల ప్రజలకు బంపర్ ఆఫర్.

**ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**

నంద్యాల పట్టణం లోని 42 వార్డ్ ప్రజలకు వర్తిస్తుంది. నంద్యాల లోని 42 వార్డుల్లో ఎక్కడైనా,ఎవరైనా రోడ్డుపై పది నిమిషాలు కదలకుండా,గోకకుండా నిలబడిన వారికి వెయ్యి రూపాయల బహుమానం ఇస్తామని అంటున్న ప్రజలు..మరో బంపర్ ఆఫర్ కూడా ఇస్తున్నారు...ఆఫ్ షర్ట్ వేసుకొని,నిక్కర్ వేసుకొని,చెప్పులు లేకుండా పది నిమిషాలు నిలబడ్డ వారికి సైతం కదలకుండా,గొక్కోకుండా నిలబడిన వారికి 2 వేలు ఇస్తామంటున్న ప్రజలు. పోటీలో నిలబడాలి అనుకునే వారికి కొన్ని షరతులు వర్తిస్తాయి..చేతులకు,కాళ్లకు నూనెలు కానీ,ఒడోమాస్ పూసుకొని రాకూడదు...ధైర్యం చేసి ఎవరైనా ఈ రెండు పోటీల్లో విజయం సాధించిన తర్వాత దోమలు కుట్టడం వల్ల ఏమైనా అనారోగ్యాలకు గురైతే బహుమతులు ఇచ్చిన వారిపై ఎలాంటి పిర్యాదులు ఇవ్వకూడదు..బహుమతి గెలుచుకున్నవారికి నగదు పురస్కారంతో పాటు కోసరుగా దోమల బ్యాట్ ఫ్రీ..నంద్యాల మున్సిపల్ శానిటేషన్ అధికారులు ఇప్పటికైనా దోమల నివారణకు చర్యలు చేపడతారని ఆశిద్దాం...నంద్యాల పట్టణంలో 42 వార్డుల్లో కాకపోయినా సాయంత్రం వేళ మున్సిపల్ కార్యాలయం లోని మున్సిపల్ కమిషనర్,శానిటేషన్ కార్యాలయం ముందు నిలబడి న వారికి సైతం ఈ పోటీలో నిలబడవచ్చు...ఒక విషయం అర్థం కానిది ఏమంటే మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న వారు రాత్రి వరకు కొందరు పని చేస్తున్న వారికి దోమలు కుట్టకపోవడం విశేషం. దోమల కు వీళ్లు మున్సిపల్ అధికారులని వీళ్లను కుడితే ఫ్యాగింగ్, స్ప్రే చేసి చంపేస్తారని బయపడి కుట్టడం లేదని సమాచారం.

## కుప్పంలో అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ

చిత్తూరు: చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీలోని స్వర్ణ నవదిశ సెంటర్‌లో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ, రాష్ట్రంలోనే మొదటి కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ కేంద్రం విద్యార్థులు, నిపుణులకు ఇంటర్నెట్, ఆన్‌లైన్ టెక్స్ట్ బుక్స్, డిజిటల్ కంటెంట్ వంటి సదుపాయాలను అందిస్తుంది. ఐటి అభివృద్ధికి సాంకేతికతకు కుప్పంను ఒక వేదికగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. డిజిటల్ లైబ్రరీ, కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను కుప్పంలో ఏర్పాటు చేయటానికి కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ నిధులు అందజేసిందని చెప్పారు. ఈ సెంటర్ ద్వారా విద్యార్థులు, ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారు, చిన్న వ్యాపారవేత్తలు, ఫ్రీలాన్సర్లు లబ్ధి పొందుతారని వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని పేద కుటుంబాల వారికి ఇది ఎంతో ఉపయోగపడు తుందన్నారు. యువత, కొత్తగా స్టార్టప్‌లు పెట్టే వారికి తక్కువ ఖర్చుతో ఆఫీసు వాతావరణం కల్పించడం, డిజిటల్ చదువులను ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. కుప్పంలో ఇంత మంచి కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించటం ఎంతో సంతోషంగా ఉందని మన్నవ మోహనకృష్ణ తెలిపారు. యువతకు ఉపయోగపడే ఇలాంటి అభివృద్ధి కార్యక్రమానికి తోడ్పాటు అందించిన ఏపీటీఎస్ ఛైర్మన్ మోహన కృష్ణను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అభినందించారు.

ఉత్తేజిత దినపత్రిక

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందించిన కూటమి కార్యకర్తలు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు జనవరి 31 శనివారం పట్టణ ఎస్సీ కాలనీ నందు ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందిస్తున్న పెన్షన్లు ఒకటే నెలలో రెండు పెన్షన్లు అందుకున్న పెన్షన్ దారులు సీఎం చంద్రబాబు నాయుడు గారికి మరియు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి సార్ గారికిని మరియు కూటమి ప్రభుత్వానికిని కృతజ్ఞతలు థాంక్స్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో వార్డు ఇన్చార్జ్ అంబేద్కర్ తెలుగుదేశం పార్టీ కోపరేట్ టౌన్ బ్యాంకు డైరెక్టర్ కదిరికోట షాలేము మరియు సూరి బూత్ కన్వీనర్లు శ్రీనివాసులు వెంకటేశు వీరేష, తదితరులు పాల్గొన్నారు

# అవిశ్వాసం దెబ్బతో జూపాడుబంగ్లాలో అధికార కుర్చీ ఖాళీ -- టిడిపి రాజకీయ ఎత్తుగడ సక్సెస్..

**ఉత్తేజిత ప్రతినిధి 31**

నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండల రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. (ఎంపీపీ) పై తీసుకువచ్చిన అవిశ్వాస తీర్మానం విజయవంతం కావడంతో అధికార మార్పు జరిగింది. ఈ పరిణామం మండల రాజకీయాల్లో భారీ చర్చకు దారితీసింది. తెలుగుదేశం పార్టీ (టిడిపి) వ్యూహాత్మకంగా వ్యవహరించి మండల పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుందని శనివారం ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

మండల పరిషత్ సభ్యులలో మెజారిటీ మద్దతుతో అవిశ్వాస తీర్మానం ముందుకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ఆలస్యం, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, సభ్యులతో సమన్వయం లోపం, పరిపాలనలో పారదర్శకత లేకపోవడం వంటి కారణాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మండలాభివృద్ధి



నిలిచిపోయిందన్న భావన సభ్యుల్లో పెరగడంతో అవిశ్వాసానికి మద్దతు పెరిగిందని తెలిపారు.

అవిశ్వాస తీర్మానం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగినప్పటికీ, రాజకీయ ఉద్రిక్తత స్పష్టంగా కనిపించింది. చివరకు మెజారిటీ సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయడంతో ఎంపీపీ పదవి కోల్పోయారు.

ఈ పరిణామంతో జూపాడుబంగ్లా మండల రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. టిడిపి శ్రేణులు దీన్ని తమ రాజకీయ విజయంగా భావిస్తూ, ఇకపై మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించాయి. గ్రామీణ రహదారులు, తాగునీటి సౌకర్యాలు, సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయానికి మద్దతు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పార్టీ నాయకులు వెల్లడించారు.

ఇక స్థానిక ప్రజలు కొత్త నాయకత్వం నిజంగా అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతుందా లేదా అన్న దానిపై ఆసక్తిగా గమనిస్తున్నారు. మండల రాజకీయాల్లో చోటుచేసుకున్న ఈ మార్పు భవిష్యత్ ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూపాడుబంగ్లా మండలంలో అధికార మార్పు ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# సీబీఐ నివేదికతో కూటమీ రాజకీయాల బండారం బహిర్గతం

**తుగ్గలి:ఉత్తేజిత న్యూస్:**



తిరుపతి టీటీడీ లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ నివేదిక వెలువడిన నేపథ్యంలో అధికార కూటమిపై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ స్పష్టంగా పేర్కొనడంతో,ఈ మొత్తం వివాదం రాజకీయ దురుద్దేశంతోనే సృష్టించారని వైసీపీ నేతలు ఆరోపించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ కావాలనే తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. మండల కేంద్రమైన తుగ్గలిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారుడు వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకున్న దుర్బుద్ధి చంద్రబాబుకే సొంతం అన్నారు. టీటీడీ లడ్డులో పంది కొవ్వు కలిసిందంటూ ప్రచారం చేసి భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారని,చంద్రబాబు మాట విని దుర్గగుడి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు మళ్లీ వచ్చి మెట్లు కడిగి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఏడాది వరదల సమయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే టీటీడీ లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారని శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఒక్క కూటమి నేత కూడా మాట్లాడలేని పరిస్థితి వచ్చిందన్నారు. టీటీడీ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. టీటీడీ లడ్డూ అంశంపై చంద్రబాబు,పవన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని,సనాతన ధర్మం పేరుతో అపచారం చేసి భక్తుల్లో ఆందోళనలు సృష్టించారన్నారు. సీబీఐ స్పష్టంగా జంతువుల కొవ్వు కలవలేదని తేల్చినా కూడా కూటమి నేతలకు సిగ్గు రావడం లేదని మండిపడ్డారు. చంద్రబాబు,పవన్ కళ్యాణ్ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో చెంపలు వేసుకుని క్షమాపణలు చెప్పాలని,అలిపిరి మెట్లు కడిగినంత మాత్రాన వారికి ప్రాయశ్చిత్తం కాదని వ్యాఖ్యానించారు.

**చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.....**

ఈ సందర్భంగా శనివారం రోజున వైసీపీ నాయకులు,కార్యకర్తల ఆధ్వర్యంలో తుగ్గలిలోని చెన్నకేశవస్వామి వద్ద శ్రీనివాస్ రెడ్డి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల మనోభావాలు కాపాడాలని,తప్పుడు ప్రచారాల నుంచి దేవాలయాలను రక్షించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శి తుగ్గలి మోహన్ రెడ్డి,వైసిపి తాలూకా ఐటి అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,ఎంపీటీసీ రాజు,మాజీ సర్పంచ్ లు పురుషోత్తం, దేవరాజు,వార్డు మెంబర్లు, వైసీపీ సీనియర్ నేతలు,వైసీపీ నాయకులు,కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# త్వరగా డి పి ఆర్ టెండర్లు వేయండి :మున్సిపల్ చైర్మన్







## పట్టణ అభివృద్ధికి వేగవంతంగా కృషి చేస్తా : మున్సిపల్ కమిషనర్

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**

నూతనంగా డి పి ఆర్ ద్వారా 22 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి

సెంటర్ పోల్ ఎందుకు ఓపెన్ చేయలేదు టెండర్లు ఎందుకు వేయలేదు త్వరగా టెండర్లు వేసి పట్టణ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. శనివారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మున్సిపాలిటీ మేనేజర్ అభివృద్ధి పనుల ఎజెండాను చదివి వినిపించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు నూతనంగా బాధ్యతలు తీసుకున్న మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డిని, ఆర్వో బి. బాబు కు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు చాంద్బాషా, కౌన్సిలర్ చిన్నరాజా, ఇతర కౌన్సిలర్లు మాట్లాడుతూ ముస్లిం స్మశాన వాటికకు వెళ్లేందుకు అడ్డంగా డ్రంపింగ్ చేశారు వాటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

మున్సిపల్ కమిషనర్ స్పందించి డంపింగ్ యార్డు వద్ద ఆఫీస్ అన్న కేటాయించి మున్సిపల్ పొక్లిన్, టాక్టర్ తో ప్రభుత్వ స్థలం వద్దకు మార్పిస్తామని హామీ ఇచ్చారు. హౌసింగ్ డిపార్ట్మెంట్ ప్రజా ప్రతినిధులకు తెలియకుండా అనుమతి పత్రాలను అందజేస్తున్నారని, ప్రభుత్వం ఎన్టీఆర్ గృహకల్పన కింద అర్హులైన వారికి గృహాలు మంజూరు చేసి త్వరగా పూర్తిచేయాలని ఆదేశిస్తున్నప్పటికీ ప్రజల గూడు పట్టించుకోకుండా రెవెన్యూ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అదేవిధంగా హౌసింగ్ కట్టుకోవడానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా రెవెన్యూ సిబ్బంది ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇల్లు కట్టుకోవడానికి పర్మిషన్ ఇచ్చిన తర్వాత పొల్యూషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ప్రజలకు ఇబ్బంది పెట్టకూడదని వారు హౌసింగ్ ఏఈ సూచించారు. ఏదైనా ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందజేసేటప్పుడు కౌన్సిలర్లకు తెలుపాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి చైర్మన్ మరియు కౌన్సిలర్ సహకరిస్తామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నేను నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని ఇంకా వార్డులలో పర్యటించి సమస్యలపై అధికారులను దృష్టికి తీసుకుపోయి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, నందికొట్కూరు టౌన్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపాలిటీ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో లబ్ధిదారుల ముఖాల్లో వెలుగులు!

**ఉత్తేజిత న్యూస్ జనవరి 31, సి.బెళగల్**



మండల పరిధిలోని బురాన్ దొడ్డి గ్రామంలో,ఎంపీడీవో రాణెమ్మ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. బురాన్ దొడ్డి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో నాయకులతో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పెన్షన్ డబ్బును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వతాతలకు ఇచ్చిన మాట ప్రకారం. 4000 రూపాయలు చేశామని, వికలాంగులకు ఆరువేల రూపాయలను అందిస్తున్నామని ,పెన్షన్ పెంపు ద్వారా లబ్ధిదారుల ముఖాలలో వెలుగులు నిండాయని,తెలిపారు. అనంతరం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్శనలో విద్యార్థులతో కలిసి కొన్ని నిమిషాలు మాట్లాడి సమయం గడిపారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి,ఏవో శ్రీనివాసులు,గ్రామ అభివృద్ధి అధికారి వెంకటేష్,మరియు సచివాలయ సిబ్బంది, సి.బెళగల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్,సింగిల్ విండో అధ్యక్షులు చిన్న తిమ్మప్ప,ఎంపిటిసి ఈరన్న గౌడ్,పెమర భీమన్న,ఎమ్మార్పీఎస్ నాగరాజు,పోలకల్ అమర్ నాథ్,గ్రామ సర్పంచ్ రామాంజనేయులు,ఎంపిటిసి కృష్ణవేణి,తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకులు రామ్మోహన్ రెడ్డి,వివిధ గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మార్కెట్ ప్రసాద్ కు బ్రహ్మోత్సవ ఆహ్వానం

**నంద్యాల ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**

దక్షిణ కాశీగా, భూకైలాసంగా విరాజిల్లుతున్న తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం శైవక్షేత్రాలలో విశిష్ట స్థానం కలిగిన దివ్య క్షేత్రంగా ప్రసిద్ధి గాంచింది. శ్రీ సాలె కాళ పాము, హస్తి ఏనుగు వంటి మూగజీవులకు పరమేశ్వరుడు మోక్షం ప్రసాదించిన మహిమ కలిగిన క్షేత్రంగా శ్రీకాళహస్తి నిలిచింది. రాహు కేతు పూజలకు ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచిన ఈ క్షేత్రంలో ప్రతి సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించబడుతున్నాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుండి ఫిబ్రవరి 23 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి బాపి రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు కూరగాయల దాతగా పేరుపొందిన మార్కెట్ ప్రసాద్ గారికి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ కార్యనిర్వహణ అధికారి టి బాపి రెడ్డి గారు గౌరవపూర్వకంగా అందించారు.

ఎన్నో సంవత్సరాలుగా ఆలయ కార్యక్రమాలకు నిరంతర సేవలందిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్న మార్కెట్ ప్రసాద్ గారి సేవాభావాన్ని దేవస్థాన అధికారులు ప్రశంసించారు. బ్రహ్మోత్సవాల విజయవంతమైన నిర్వహణకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు. రచయిత అనిల్ రావిపూడి గారితో స్నేహ పూర్వకంగా కలిసారు.

# చేనేత కార్మికుడు ఆత్మహత్య -- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారి పరామర్శ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు జనవరి 31 శనివారం పట్టణ పరిధిలోని శివన్న నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రాజు , తీవ్రమైన అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీవి. జయ నాగేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుడి పార్థివ దేహానికి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10,000/-లను అందజేశారు.

# సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాసులుకు పరామర్శ....మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా

నంద్యాల పట్టణం ప్రజాశక్తి సీనియర్ రిపోర్టర్ మరియు అక్రిడేషన్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు గుండె సమస్యతో బాధపడుతూ ఇండస్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మరియు ఎమ్మెల్సీ బాషా, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దేశం సుధాకర్ రెడ్డి, వైసీపీ జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్ వెళ్లి పరామర్శించారు. అలాగే డాక్టర్ క్రాంతి చైతన్య గారితో మాట్లాడి శ్రీనివాసులు గారికి మంచి వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారు కోరారు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు

# సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరుతాయి

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**



నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ఎం ఘణపురం ఎ న్ ఘణపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ ని ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే చేరుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించారు.

రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ఇంటి వద్దకే చేరుతాయి అదేవిధంగా ఒకటో ఆదివారం ఉన్నందున ఒకరోజు ముందుగానే అర్హులందరికీ పింఛన్ పంపిణీ ఘనత దేశ చరిత్రలోనే ఒక్క చంద్రబాబు నాయుడు చెందుతుందని ఎమ్మెల్యే కొనియాడారు

అనంతరం: ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్ ) ద్వారా ప్రాతకోట గ్రామంలో, డి లక్ష్మీదేవి కి రూ 20 వేలు మంజూరైన చెక్కును లబ్ధిరాలుకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి , మాజీ సర్పంచ్ చంద్రేష్, మద్దిలేటి గౌడ్, నాగేశ్వరరావు, శీను, రమణ, శ్రీనివాసులు, హరికుమార్, వేణుగోపాల్, హరిబాబు, బాలకృష్ణ, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు,

# ఎమ్మిగనూరు పట్టణం 23వ వార్డులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు**



జనవరి 31 శనివారం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు మరియు తదితరులకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను నిరంతరాయంగా చేరేటట్లు ఉండాలని సూచించారు. బిలితదుపరి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారుఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి వార్డులో నడుచుకుంటూ పలుచోట్ల పర్యటించి, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, లైటింగ్ ఒ మౌలిక వసతులు సంబంధించిన సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు. ప్రజలతో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు పాలు లేకుండా నెయ్యి తయారు చేయడం, నెయ్యిలో కల్తీ చేయడం, ఆ కల్తీ నెయ్యితోనే స్వామివారి ప్రసాదాలు తయారు చేసిన విషయం సిట్ దర్యాప్తు, చార్జిషీట్ల ద్వారా పూర్తిగా బట్టబయలైందన్నారు. వైసీపీ పాలనలో టీటీడీ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి, కల్తీకి రహదారి నిర్మించారని, విచిత్రమైన కంపెనీలకు ఎటువంటి సరైన విచారణ లేకుండా టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు.

# నంద్యాలలో బంగారు దుకాణాల యాజమానులా మజాకానా.

**నంద్యాలఉత్తేజిత ప్రతినిధి జనవరి 31**

ప్రపంచవ్యాప్తంగా కొద్ది రోజులుగా బంగారు,వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గతంలో తులం బంగారు 70 వేలు,కేజీ వెండి 70 వేలకు దొరికేది. గత కొన్ని నెలల నుంచి బంగారు,వెండి ధరలు పేద,మధ్య తరగతి ప్రజలు కొనలేని విధంగా చేరుకుంది. ఇటీవల బంగారు తులం లక్షా ఎనభై వేలకు చేరుకుంది. వెండి దాదాపు నాలుగు లక్షల ,ఇరవై వేలకు చేరిపోయింది. ఈ నేపథ్యంలోనే బంగారు,వెండి కొనుగోలు చేయాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి తర్వాత పెళ్ళిళ్ళు మొదలవుతాయని అందరికీ తెలిసిందే. పెళ్ళిళ్ళకు బంగారు,వెండి కొనుగోలు చేయడం సర్వ సాధారణమే. బంగారు,వెండి ధరలు పెరగడంతో కొనుగోళ్లు మందగించాయి. దుకాణం దారులు మాత్రం ధరలు పెరిగితే మాత్రం వెంటనే ధరలు పెంచేస్తారు. ధరలు ఒక వేళ భారీగా తగ్గితే మాత్రం వారి నోటి వెంట వచ్చే సమాధానం ఒక్కటే మాకు ఇంకా సమాచారం రాలేదు అని ఒక మాట,మా వద్ద స్టాక్ లేదని ఒక మాట చెప్పడం విశేషం. ఈ నేపథ్యంలోనే నంద్యాలలో బంగారు వ్యాపారుల రూటే సపరేటు అన్న విధంగా ప్రవర్తిస్తున్నారు. శుక్రవారం విపణి వీధుల్లో ఒక్కసారిగా బంగారు తులానికి 15 వేలు,వెండి కిలోకు 65 వేలు తగ్గడం ఊహించని పరిణామం. రోజు,రోజుకు పెరుగుతున్న బంగారు,వెండి ధరలు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో తగ్గడంతో కొందరు దుకాణాల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలనుకునే వారికి షాక్ కొట్టే మాటలు విని చేసేది ఏమి లేక వెనుతిరిగిపోతున్నారు. వ్యాపారులు పెరిగితే పెంచుతారు కానీ తగ్గితే మాత్రం స్టాక్ లేదని చెప్పడం మంచి పద్ధతి కాదని చెపుతున్నారు.

# తెల్లబట్టలపై మరకలు పోతాయ్..








తెల్ల బట్టలు వేసుకోవడానికి ఎంత బావుంటాయో.. వాటిని మెంటెయిన్ చేయడం కూడా అంతే కష్టం. ముఖ్యంగా కాలర్, అండర్ ఆర్మ్స్ మీద మరకలు అలానే ఉండిపోతాయి. ఏం చేస్తే ఈ మరకలు పోతాయో అస్సలు తెలియవు. అందుకే ఇప్పుడు చెప్పే ఈ టిప్స్‌తో సమస్యని దూరం చేసుకోండి. వైట్ క్లాత్స్‌పై ఏ చిన్న మరక పడినా అది వదలడం చాలా కష్టం. అందుకే వాటిని సెపరేట్‌గా ఉతకండి. ఇతర బట్టలతో కలిపి ఉతకొద్దు. ఎందుకంటే, వాటి రంగులు తెల్ల బట్టలకి అంటుకుని మొండి మరకల్లా మారతాయి. వీటిని కెమికల్స్‌తో నిండిన సబ్బు, డిటర్జెంట్ లిక్విడ్స్‌తో రుద్దితే ఉన్న తెల్లదనం తగ్గిపోతుంది. తెల్లని బట్టల్ని ఎక్కువసేపు ఎండలో ఆరబెట్టొద్దు. కొద్దిసేపు ఆరబెడితే చాలు. ఎక్కువగా వేడి ఉన్న ప్రాంతంలో ఆరేస్తే కలర్ చేంజ్ అవుతాయి. కాబట్టి, అలా చేయకండి.

చాలా మంది బట్టలకి బ్లీచ్ వాడుతుంటారు. వీటిని వాడాలనుకుంటే కాటన్ వాటికి వాడండి. అన్ని బట్టలకు వద్దు. వీటిని వాడడం వల్ల బట్టలు పాడయ్యే అవకాశం ఉంది. చాలా మంది బట్టలు తెల్లగా మారాలని ఎక్కువగా సబ్బు వాడతారు. దీని వల్ల తెల్ల బట్టలపై మురికి పోతుంది. కానీ, తెలుపుదనం తగ్గుతుంది. కాబట్టి, కొద్దిగా మాత్రమే సబ్బుని వాడండి. నీలిరంగు.. ఆప్టికల్ బ్రైటెనర్స్‌ని పిలిచే నీలిరంగుని వాడతారు. వీటిని వాడితే బట్టలు తెల్లగా మారతాయి. ఈ బ్లూయింగ్ ఏజెంట్‌ని వాషింగ్ మెషిన్‌లో డిటర్జెంట్ డిస్పెన్సర్‌కి జోడించవచ్చు. నిమ్మరసం.. నిమ్మరసం కూడా తెల్ల బట్టలపై మరకల్ని ఈజీగా దూరం చేస్తుంది. ఇందులోని బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఇది తెల్లని బట్టలపై మురికిని దూరం చేస్తుంది. ఇందుకోసం ముందు రోజు నిమ్మకాయ రసాన్ని మరకలపై రాసి వేడి నీటిలో నానబెట్టండి. హైడ్రోజన్ పెరాక్సైడ్.. అదే విధంగా, డిటర్జెంట్‌కి హైడ్రోజన్ పెరాక్సైడ్‌ని కలపండి. తెల్లని బట్టల కాలర్లు, అండర్ ఆర్మ్స్ ప్రాంతాల్లోని మురికిని దూరం చేసేందుకు వాడొచ్చు. ఇలా చేయడం వల్ల చాలా వరకూ మరకలు దూరమవుతాయి.

# ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే....



సమ్మర్‌లో కూరగాయలు, పండ్లు త్వరగా వాడిపోతాయి. అలా కాకుండా ఉండాలంటే వీటిని ఎలా స్టోర్ చేసుకోవాలో తెలుసుకోండి. సాధారణంగా చాలా మంది ఫ్రిజ్‌లో పండ్లు, కూరగాయలు పెడుతుంటారు. ఎందుకంటే ఫ్రిజ్‌లో వీటిని పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కానీ, కొన్నిసార్లు పండ్లు, కూరగాయల్ని ఫ్రిజ్‌లో పెట్టినా పాడవుతుంటాయి. దీనికి కారణాలు ఏంటి. ఎందుకిలా త్వరగా పాడవుతాయి. మరి వీటిని ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.

అన్నింటిని ఒకేదగ్గర వద్దు.. కూరగాయలు, పండ్లలో చాలా ఎంజైమ్స్ ఉంటాయి. వీటిని అన్నింటిని ఒకేదగ్గర పెడుతుంటారు చాలా మంది. దీంతో కొన్ని కూరగా యలు, పండ్లు ఇథలీన్‌ని ఉత్పత్తి చేస్తాయి. దాంతో అవి త్వరగా కుళ్ళిపోతాయి. అటువంటి కూరగాయలు, పండ్లని ఎలా స్టోర్ చేయాలో తెలుసుకోండి. క్యాబేజీ.. క్యాబేజీ కూడా తాజాగా ఉండాలంటే స్వచ్ఛమైన గాలి అవసరం. అందుకే, యాపిల్స్, పుచ్చకాయలు, కివీస్ వంటి పండ్లతో వీటిని కలిపి పెట్టొద్దు. ఇవన్నీ కూడా ఇథలీన్‌ని రిలీజ్ చేసే పండ్లు. కాబట్టి, వీటికి దూరంగా ఉంచి స్టోర్ చేయడం అవసరం.

సొరకాయతో వద్దు.. సొరకాయ, పొట్లకాయ వంటి కూరగాయల్ని యాపిల్, ద్రాక్ష, అంజీర్ వంటి పండ్లతో కలిపి ఒకే దగ్గర స్టోర్ చేయొద్దు. ఎందుకంటే ఇవి కూడా ఇథలీన్‌ని రిలీజ్ చేస్తాయి. దీంతో త్వరగా పాడవుతాయి.బ్రకోలీతో ఫ్రూట్స్ వద్దు.. బ్రకోలీతో ఫ్రూట్స్ వద్దు.. బ్రకోలీకి ఇథలీన్ పడదు. కాబట్టి.. మీరు దీనిని ఆపిల్, అత్తి, ద్రాక్ష పండ్ల వంటి ఇథలీన్ ఉత్పత్తి చేసే పండ్లతో బ్రకోలీని పెడితే అది త్వరగా పాడవుతుంది. అందుకే వాటిని ఈ పండ్లతో కలిపి పెట్టొద్దు.. ఆకుకూరలతో ఇవి వద్దు.. ఆకు కూరలు తాజాగా ఉండాలంటే వాటిని సెపరేట్‌గా ప్యాక్ చేసి పెట్టాలి. వీటికి దగ్గర్లో పుచ్చకాయ, ద్రాక్ష, యాపిల్స్ వంటి ఇథలీన్ రిలీజ్ చేసే పండ్లతో కలిపి పెట్టొద్దు. దీని వల్ల ఆకుకూరలు త్వరగా పాడవుతాయి. అందుకే వీటికి సెపరేట్‌గా పెట్టండి.

# గులాబీ మొక్కకి పూలు ఎక్కువ పూయాలంటే...

వర్షాలు మొదలయ్యాయి. ఈ సమయంలో చాలా మంది మొక్కలు పెడుతుంటారు. పూ మొక్కలు అంటే చాలా మందికి ఇష్టం. ఇందులో గులాబీలు ప్రత్యేకం. మరి ఆ చెట్లకి పువ్వులు ఎక్కువగా పూయాలంటే ఏం చేయాలి.

గులాబీ మొక్కకి పూలు ఎక్కువ పూయాలంటే ఇలా చేయండి.. కొంతమంది మొక్కలు పెంచుతారు. అలాంటప్పుడు కొన్ని పొరపాట్లు కూడా ఉంటాయి. అలానే గులాబీ మొక్కలు పెంచేటప్పుడు కూడా కొన్ని తప్పులు చేస్తుంటారు. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే మనం కొన్ని విషయాలు పాటించాలి. అప్పుడే అవి ఎక్కువ పూలు పూస్తాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం. కొనేటప్పుడు.. మీరు గులాబీ మొక్కను కొనేటప్పుడు ఆల్రెడీ పూలు ఉంటే వాటిని తీసి వేయండి. అప్పుడే కొమ్మలు మాత్రమే పెరుగుతాయి. గులాబీ మొగ్గలు వస్తాయి. కాబట్టి, కొనేటప్పుడు ఏమైనా పూలు వుంటే తీసేయండి. ఎక్కడ నాటాలి.. గులాబీ మొక్కల్లో చాలా రకాలు ఉన్నాయి. కాబట్టి, మనం ఏది కొంటున్నామో కూడా తెలుసుకోవాలి. గులాబీలను వెలుతురు ఉన్న ప్రదేశంలో పెట్టాలి. రెగ్యులర్‌గా ప్లేసెస్ మార్చొద్దు. తర్వాత దీనికి మంచి కంపోస్ట్ రిచ్ మట్టిని వాడాలి. కనీసం





రెండు అడుగుల లోతులో గులాబీలను నాటండి. మీరు కంపోస్ట్, మట్టిని కలిపి వాడొచ్చు.

నీరు పోయడం.. గులాబీలకు నీరు పోయడం కూడా చాలా ముఖ్యం. పొడి వాతావరణంలో నీరు సరిగ్గా పట్టాలి. నీరు పోసేటప్పుడు ఆకులపై నీరు పడకుండా చూడాలి.

వేప మిశ్రమం.. గులాబీ మొక్కలు ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితో పాటు వేప పొడి కలిపి గులాబీ మొక్కలు నాటాలి. ఇది ఎక్కువగా ఎరువుల దుకాణాల్లో దొరుకుతుంది ఇలా నాటితే పురుగులు పట్టకుండా మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయి. రాలుతున్న పూలు.. ఎప్పటికప్పుడు రాలే పూలను తీసేయాలి. దీని వల్ల కొత్త పూలు వస్తాయి. గులాబీలు వసంతకాలం నుండి చివరి శరదృతువు వరకు వికసిస్తాయి. వాటిని చూసినప్పుడల్లా రాలుతున్న పూలని తీసేయాలి.

పురుగు మందులు.. అదే విధంగా, గులాబీ మొక్కలకి బయట దొరికే పురుగు మందులు బదలు ఇంట్లోనే కొన్ని సహజ క్రిమి సంహారకాలు తయారు చేయొచ్చు. అందుకోసం వేపాకులు తీసుకుని అందులో వెల్లుల్లి తొక్క వేసి మొత్తగా మిక్సీ పట్టి ఈ మిశ్రమాన్ని ఫిల్టర్ చేసి స్ప్రే బాటిల్‌లో వేయాలి. దీనిని స్ప్రే చేస్తుంటే చీడపీడలు, కీటకాలు, చీమలు వదులుతాయి.



# పిల్లల గది ఇలా డిజైన్ చేస్తే..



పిల్లల రూమ్ డిజైన్ చేయడం.. తల్లిదండ్రులకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. పిల్లలకు నచ్చేలా, వారి ఇష్టాలకు అనుగుణంగా రూమ్ డిజైన్ చెయ్యాలనుకుంటారు. పిల్లల రూమ్ ఎలా డిజైన్ చేయాలో ఈ స్టోరీలో చూద్దాం. తల్లిదండ్రులకు ఎప్పుడూ ఎగ్జైటింగ్‌గానే ఉంటుంది. పిల్లల గది డిజైన్ చేయడం అంత ఈజీ కాదు. పిల్లలకు ఏమి ఇష్టం, ఆసక్తి, వారి ఆలోచనలను దృష్టిలో ఉంచుకుని వారి గదిని అలంకరించాలి. చిన్నారుల్లో సృజనాత్మక శక్తిని మేల్కొలిపేలా, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేలా వాళ్ల గది డిజైనింగ్ ఉండాలి. పిల్లలకు అదే ప్రపంచం.. ఆ గదిలోనే ఆడతారు, చదువుకుంటారు, నిద్రపోతుంటారు. పిల్లల రూమ్ డిజైన్ చేసేప్పుడు.. గుర్తుపెట్టుకోవలసిన ముఖ్యమైన విషయాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

పిల్లలు ఎక్కువగా ముదుర రంగులను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. వారి రూమ్‌లో ఒకే గోడకు ముదురు రంగులు వేయించండి. మానసిక శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం చిన్న పిల్లలు ఎరుపు, నీలం, పసుపు రంగులను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. ఇవి కాకుండా ఆకుపచ్చ, పర్పుల్ కూడా వారికి నచ్చుతాయి. మొత్తం అంతా ఒకే రంగు కాకుండా గదిలో వేర్వేరు చోట్ల వేర్వేరు రంగులను వేయించండి. ఒక గోడ మీద కార్టూన్‌లు, బొమ్మలు, వాళ్ల ఫేవరెట్ కార్టూన్, కథల్లోని పాత్రలను గోడ మీద వేయించవచ్చు.

కార్టూన్లు, బొమ్మలతో వాల్‌పేపర్లు వస్తున్నాయి. వాటిని గోడమీద అంటించొచ్చు. ప్రయాణాలంటే ఇష్టపడుతున్నా, వారిలో అటువంటి ఆలోచనలు తేవాలన్నా ప్రపంచ పటం వాల్‌పేపర్‌గా ఉంటే బావుంటుంది. స్టార్స్, ట్రైయాంగిల్స్, సర్కిల్ లాంటి పిల్లలకు స్పషల్‌గా ఉంటాయి.




చిన్నారుల కోసం ఫర్నీచర్, మంచం లాంటివి కొనేప్పుడు ఆకారాల్లో, రంగుల్లో ఆకర్షణీయంగా, భిన్నంగా ఉండేట్టు చూడాలి. బెడ్ అందంతో పాటు పిల్లల భద్రత, సౌకర్యాలకు కూడా ప్రాధాన్యమివ్వాలి. పిల్లల పరుపు మరీ గట్టిగా ఉండకుండా చూసుకోవాలి. కొద్దిగా మెత్తగా ఉంటే పిల్లలు ఇష్టపడతారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్నట్లయితే ప్లేస్ అడ్జెస్ట్‌మెంట్ చాలా ముఖ్యం. ఈ పరిస్థితి ఉంటే.. బంక్ బెడ్‌లు, ట్రండల్ పుల్ అవుట్ బెడ్‌లు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించవు. కొన్ని ఫర్నీచర్ ఐటెమ్‌లలో, డ్రాయర్‌లను బంక్ బెడ్ మెట్లలోకి నిర్మించవచ్చు స్టడీ ఎసెన్షియల్‌లను స్టోర్ చేయడానికి వీటిని ఉపయోగించవచ్చు. పిల్లలు చదువుకోవడానికి ఓ మూల టేబులు, చైర్ ఎరేంజ్ చెయ్యాలి. మంచంలోనే చాక్‌బోర్డులను ఏర్పాటు చేసుకోవడం ఇప్పటి పిల్లల గదుల ప్రత్యేకత. పిల్లలు యాక్టివ్‌గా ఉంటారు. వాళ్ల గదిలోనే అటూ ఇటూ తిరుగుతూ ఆడుతూ ఉంటారు. వాళ్ల సేఫ్టీని దృష్టిలో ఉంచుకుని రూమ్ డిజైన్ చేయడం మంచిది. ఫర్నిచర్ స్ట్రాంగ్‌గా, క్వాలిటీగా ఉండేలా చూసుకోవాలి. ఫర్నిచర్ అంచులు గుండ్రంగా ఉండాలి. రాత్రిళ్లు నిద్రపోయే ముందు లైట్స్ ఆఫ్ చేస్తే పిల్లలు కొత్తలో భయపడతారు. చీకట్లో కూడా మెరిసేలా సీలింగ్‌కు మెటాలిక్ రంగులు వేస్తే చీకట్లోనూ భయం లేకుండా నిద్రపోతారు. పిల్లల గదిలో కంటికి శ్రమ కలిగించని ఫ్లోరోసెంట్ బల్బులను వాడాలి.

# ఏసి కచ్చితంగా రిపేర్ చేయించాలి..

ఎండాకాలంలో చాలా మంది ఏసీలు వాడుతుంటారు. వీటిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా మెంటెయిన్ చేయాలి. లేకపోతే దీనిని ఆస్వాదించలేం. కొన్ని ప్రాబ్లమ్స్ వచ్చినప్పుడు వాటిని గుర్తించి రిపేర్ చేస్తే మంచి కూలింగ్ ఫీల్‌ని పొందగలం. అవేంటో ఇప్పుడు చూద్దాం. వేడి గాలి వచ్చినప్పుడు.. చాలా మంది ఏసీలను ఆస్వాదించాలనుకుంటారు వీటిని కొన్న కొత్తలో చల్లగా ఊటీలోనో, కొడైకెనాల్‌లోనో ఉన్నట్లుగా అనిపిస్తుంది. కానీ, రోజులు గడిచేకొద్దీ ఏసీ నుంచి వేడి గాలి వస్తుంటుంది. అలాంటప్పుడు ఏం చేయాలంటే.. ఏసి టెంపరేచర్‌ని రూమ్ టెంపరేచర్ కంటే తక్కువగా సెట్ చేయండి. అయినా వేడి గాలి వస్తుంటే ఓ సారి రిపేర్ చేయించడం మంచిది. గాలి రాకపోతే.. అదే విధంగా కొన్నిసార్లు సరిగ్గా గాలి రాదు. వెంటిలేషన్ లేకపోతే ఇలా జరుగుతుంది. మీ ఏసీ కెపాసిటీ సరిగ్గా లేకపోతేనే ఇలా అవుతుంది. కాబట్టి, ఓ సారి సర్వీసింగ్ చేయించడం మంచిది. దీని వల్ల ఏసి సరిగ్గా పనిచేస్తుంది. దీంతో పాటు కొంతమంది ఏసీలు ఆన్ చేసినప్పుడు ఎక్కువగా సౌండ్ వస్తుంటుంది. అలా రాకుండా ఉండాలంటే కచ్చితంగా ఓ సారి ఏసీ రిపేర్ చేయించాల్సిందే.. ఎక్కువగా చలిగా అనిపించినప్పుడు.. సాధారణంగా రూమ్ టెంపరేచర్ చల్లగా ఉంచేందుకే ఏసీలను వాడుతుంటారు. వీటికి అనుగుణంగానే ఏసీలు వాడినప్పుడు రూమ్ టెంపరేచర్ చల్లగా అయితే, ఆపరేటింగ్ సిస్టమ్ దానంతట అదే ఆఫ్ అవుతుంది. అలా జరగకుండా రూమ్‌లో ఇంకా చల్లదనం పెరుగుతుంటే కచ్చితంగా దీనిని రిపేర్ చేయించడం మంచిది. నీరు కారడం.. ఇది కూడా ఓ ముఖ్య కారణం. ఏసీ నుంచి నీరు కారడం కరెక్ట్ కాదు. ఇది ఏసి కండిషనింగ్ యూనిట్ ప్రాబ్లమ్, కాబట్టి, ఇలా జరిగినప్పుడు కూడా వెంటనే ఏసిని రిపేర్ చేయించడం బెస్ట్. దుర్వాసన వస్తుంటే.. ఏసీ వాడినప్పుడు వాసన కొద్దిగా తేడా వస్తుందా.. అయితే దీనికి కారణం సిస్టమ్ సరిగ్గా పనిచేయకపోవడం. కాబట్టి, ఈ టైమ్‌లో కూడా వెంటనే రిపేర్ చేయించాలి. రూమ్ మొత్తం ఒకే టెంపరేచర్.. అదే విధంగా ఏసీ ఆన్ చేసినప్పుడు రూమ్ మొత్తం ఒకే టెంపరేచర్ ఉండాలి. అంతేకానీ, ఒక్కో చోట ఒక్కో టెంపరేచర్ ఉంటే ఆపరేటింగ్ సిస్టమ్‌లో ప్రాబ్లమ్ ఉన్నట్లే. కాబట్టి, ఆ సమయం లో కచ్చితంగా ఏసి రిపేర్ చేయించాల్సిందే. కరెంట్ బిల్ ఎక్కువగా రావడం.. అదే విధంగా, ఏసి వాడినప్పుడు సాధార ణంగా కరెంట్ బిల్ ఎక్కువగా వస్తుంటుంది. ఇది సాధారణమే కానీ, మొదట్లో వాడినప్పుడు తక్కువగా వచ్చి రానురాను ఎక్కువగా వస్తే.. కచ్చితంగా రిపేర్ చేయించాల్సిందే.



# మిక్సీలో అల్లం రుబ్బుతున్నారా..





అల్లం, మసాలాలు, కొబ్బరి తురుము, ఇడ్లీ, దోశ పిండి ఇలా ఏవైనా సరే ప్రిపేర్ చేయడానికి మిక్సీని ఎక్కువగా వాడతారు. అన్ని అవసరాలకి అనుగుణంగా మిక్సీలను వాడుతుంటారు. అందులో కూరగాయలు కట్ చేయడం, చపాతీ పిండిని కలిపేందుకు కూడా డిజైన్ చేస్తున్నారు. దీంతో చాలా మంది వీటిని వాడుతూ ఆ విధంగానే తమ పనని ఈజీ చేసుకుంటున్నారు. కానీ, ఇలా చేసేటప్పుడు కొన్నింటిని గమనించాలని చెబుతున్నారు నిపుణులు.

చపాతీ పిండి.. చాలా మంది పిండిని కలిపేందుకు కూడా మిక్సీలను వాడుతుంటారు. దీనికోసం ప్రత్యేకంగా అట్టా నీడర్ ఉంటుంది. అందుకోసం వేసి పిండిని మెత్తగా కలుపుతారు. కానీ, పిండి త్వరగానే కలిసిపోతుంది. కానీ, చేతితో కలిపినట్లుగా ఉండదు. దీనివల్ల చపాతీలు కూడా బాగా రావు. కాబట్టి, చేతితో కలపడం మంచిది.

వేడి వేడి ఫుడ్స్.. వేడి వేడి ఫుడ్స్.. అదే విధంగా కొన్నింటిని ఫ్రై చేసి అవి వేడిగా ఉండగానే మిక్సీలో వేస్తారు చాలా మంది. అలా ఎప్పుడు చేయకూడదు. దీని వల్ల జార్ త్వరగా పాడవుతుంది. అంతేనా, విరిగిపోతుంది కూడా. అలా కాకుండా వాటిని కాస్తా గోరువెచ్చగా అయ్యేవరకూ ఉండి ఆ తర్వాత వాటిని మిక్సీ పట్టాలి. అల్లం వెల్లుల్లి.. అల్లం వెల్లుల్లిని చాలా మంది మిక్సీ జార్‌లోనే వేస్తారు. ఇది అందరూ చేసేదేగా ఎందుకు వద్దు అనుకుంటున్నారా.. వీటిని ఎక్కువ పరిమాణంలో చేస్తే త్వరగా అయ్యేందుకు మిక్సీ వాడొచ్చు. అదే తక్కువగా చేస్తే వాటిని చిన్న జార్‌లో వేసే బదులు చిన్న రోలులో వేయాలి. ఎందుకంటే, తక్కువగా వేస్తే అది ఆ బ్లేడ్స్‌లోనే చాలా వరకూ ఇరుక్కుంటుంది. త్వరగా బయటికి రాదు వాసన కూడా వస్తుంది. కాబట్టి, అలాంటి మసాలాలని చేత్తో నూరుకుంటేనే మంచిది. ఫ్రోజెన్.. చాలా మంది ఫ్రోజెన్ ఫుడ్స్ వాడుతుంటారరు. వీటిని అప్పుడే ఫ్రిజ్ నుంచి తీసి మిక్సీలో వేస్తే అది మెత్తగా అవ్వడానికి చాలా టైమ్ తీసుకుంటుంది. దీని వల్ల బ్లేడ్స్ త్వరగా అరిగిపోతాయి. అందుకే అలా చేయొద్దు కూరగాయలు... చాలా మంది కూరగాయల్ని కూడా చాపర్‌లో వేస్తుంటారు. కానీ, అలా వేయకపోవడమే మంచిది. ఇవన్నీ ఒకే పరిమాణంలో ఉండాలని అనుకుంటారు కానీ, అందులో ఏమైనా చిన్న చిన్న బ్యాక్టీరియా, పురుగులు వంటివాటిని గమనించలేం. అదే విధంగా, అన్నింటిని చాపర్‌లోనే వేయకూడదని గుర్తుపెట్టుకోండి.

# ఒకే కారణంతో 5 రోజుల్లో 50 శాతం పెరిగిన షేరు..



కొత్త సంవత్సరంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ ఇవాళ కూడా ప్రస్తుతం నష్టాల్లో ఉన్నాయి. ఇక అనిశ్చితి ఉన్నప్పటికీ కొన్ని పెన్నీ స్టాక్స్ మాత్రం అదరగొడుతున్నాయి. ఊహించని రీతిలో పెరుగుతున్నాయి. ఇప్పుడు అలాంటి ఒక స్టాక్ వరుసగా అప్పర్‌సర్క్యూట్ కొడుతుండటం విశేషం. దిగ్గజ టెక్స్‌టైల్ మానుఫ్యాక్చరర్ అలోక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు వరుసగా పుంజుకుంటోంది. ఇన్వెస్టర్లకు అదిరిపోయే రిటర్న్స్ అందిస్తుంది. శుక్రవారం రోజు సెషన్‌లో కూడా ప్రస్తుతం 16 శాతం లాభంతో ట్రేడవుతో ంది. ఇంట్రాడేలో 20 శాతం పుంజుకొని రూ. 32.55 వద్ద జీవన కాల గరిష్టాన్ని కూడా నమోదు చేసింది. తర్వాత ప్రాఫిట్ బుకింగ్ నేపథ్యంలో కాస్త వెనక్కి తగ్గింది. ఈ కంపెనీ షేరు ఒకే ఒక్క కారణంతో దూసుకెళ్తోంది. దీంతో ఇన్వెస్టర్లు పండగ చేసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో 5 సెషన్లు ట్రేడింగ్ జరగ్గా.. ఏకంగా 50 శాతం వరకు పెరిగింది. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఈ కంపెనీలో ప్రిఫరెన్షియల్ షేర్ల సబ్‌స్క్రిప్షన్ పేరిట ఏకంగా రూ. 3300 కోట్ల పెట్టుబడులు పెట్టింది. దీంతో ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నెలకొంది. ఈ కారణంతో స్టాక్ ముందుకు దూసుకెళ్తూనే ఉంది. కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఈ స్టాక్ రిలయన్స్ పెట్టుబడి ప్రకటన వచ్చిన జనవరి 2న 20 శాతం అప్పర్‌సర్క్యూట్ కొట్టింది. జనవరి 3న 7 శాతం పెరిగింది. జనవరి 4న రెండు శాతం తగ్గింది. మళ్లీ ఇవాళ దాదాపు 20 శాతం పెరిగి తర్వాత తగ్గింది.

ట్రెండింగ్‌లో ఇదే..

రిలయన్స్ కంపెనీ పెట్టుబ డుల నేపథ్యంలో ఈ స్టాక్ ఈ నెలలో 5 రోజుల వ్యవధిలోనే 50 శాతం వరకు పెరిగింది. 3 రోజులు లాభాలు నమోదు చేసింది. 2023 డిసెంబర్ నెలలో 8.6 శాతం పెరిగింది. నవంబర్ నెలలో 13 శాతం పుంజుకుంది. గత ఏడాది కాలంలో చూస్తే ఈ షేరు 74 శాతం పెరగ్గా.. 52 వారాల కనిష్ట ధర రూ. 10.07 నుంచి 212 శాతం పెరిగింది. 2023, ఫిబ్రవరి 22న కనిష్ట విలువను తాకింది. అలోక్ ఇండస్ట్రీస్ కంపెనీ విషయానికి వస్తే.. ముంబయి ప్రధాన కేంద్రం గా టెక్స్‌టైల్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాటన్, పాలిస్టర్ సెగ్మెంట్లో బలమైన పోటీదా రుగా ఉంది. స్పిన్నింగ్ నుంచి వేవింగ్ వరకు, ప్రాసెసింగ్, ఫినిష్డ్ ఫాబ్రిక్స్, బెడ్‌షీట్స్, టవల్స్, గార్మెంట్స్ తయారు చేస్తుంది. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 15.22 వేల కోట్లుగా ఉంది.

# లక్షను రూ. 5 లక్షలు చేసింది!

స్టాక్ మార్కెట్లలో ఐపీఓలు అద్భుతమైన రిటర్న్స్ ఇస్తాయని చెప్పొచ్చు. మినిమం గ్యారెంటీ రిటర్న్స్ ఇందులో వస్తాయి. గతేడాది ఆఖర్లో డిసెంబర్ సమయంలో చాలా ఐపీఓలు 100 శాతానిక పైగా లాభాలు అందించాయి. ఇప్పుడు కొత్త సంవత్సరంలో ఒక ఐపీఓ లిస్టింగ్‌రోజే 400 శాతానికిపైగా రిటర్న్స్ ఇవ్వడం విశేషం. దీని గురించి తెలుసుకుందాం. స్టాక్ మార్కెట్లలో మీరు పెట్టుబడులు పెడుతున్నారా? సరైన స్టాక్స్ ఎంచుకొని ఒక క్రమపద్ధతిలో పెట్టుబడులు పెడితే దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ ఆశించ వచ్చు. అదే సమయంలో చాలా మంది ఐపీఓలను (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్) నమ్ముకొని పెట్టుబడులు పెడుతుంటారు. వీటిల్లో నిర్దిష్ట మొత్తం పెట్టుబడి పెడితే.. లాట్స్ వస్తాయి. షేరు ధర ముందే నిర్ణయించిన ప్రకారం ఉంటుంది. సబ్‌స్క్రిప్షన్‌ను బట్టి షేరు ధర లిస్టింగ్ రోజే భారీ లాభంతో లిస్టవుతుంటు ంది. 2023 చివర్లో చాలా వరకు ఐపీఓలు ఇన్వెస్టర్లకు డబుల్ రిటర్న్స్ ఇచ్చాయి. వీటిల్లో ఐఆర్‌ఈడీఏ, టాటా టెక్నాలజీస్ వంటి షేర్లను ఉదాహరణలుగా చెప్పొచ్చు.



ఇప్పుడు అలాంటి ఒక ఐపీఓ మార్కెట్లలో లిస్ట్ కాగా.. ఊహించని రీతిలో లాభాల్ని అందించింది.

అదే కే సీ ఎనర్జీ ఐపీఓ కొత్త ఏడాదిలో పెట్టుబడిదారుల తలరాతనే మార్చేసింది. లిస్టింగ్‌తోనే పెట్టుబడిదారుల సొమ్ము ఏకంగా నాలుగింతలు కావడం విశేషం. ఈ ఐపీఓ కోసం కంపెనీ ఇష్యూ చేసిన షేరు ధర రూ. 54. ఇక ఇవాళ మార్కెట్లో లిస్టయిన ధర రూ. 252. ఏకంగా 367 శాతం పెరిగి లిస్టయింది. ఆ తర్వాత కూడా ఆగలేదు. 400 శాతానికిపైగా పెరిగి రూ. 264.60 వద్ద గరిష్టాన్ని తాకింది. దీంతో ఈ ఐపీఓ వచ్చిన ఇన్వెస్టర్లు లిస్టింగ్‌తోనే ఒక్కో షేరుపై రూ. 198 లాభం పొందగా.. గరిష్ట విలువ వద్ద చూస్తే రూ. 210 చొప్పున లాభం వచ్చింది. ప్రస్తుతం ఈ షేరు ధర రూ. 239.40 వద్ద ఉంది. కే సీ ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఐపీఓ డిసెంబర్ 28 (గురువారం) రోజు ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది. ఇది %చీూజు సాబీజు% ఎక్స్ఛేంజీలో లిస్టయింది. జనవరి 2 (మంగళవారం) రోజున సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. ధరల శ్రేణిని రూ. 51-54 వద్ద పేర్కొంది. ఈ ఐపీఓ పరిమాణం మొత్తం 2000 షేర్లు. దీంతో ఇన్వెస్టర్ పెట్టుబడి రూ. 1,08,000 గా ఉంది. లిస్టింగ్ రోజు లాభాల్ని చూస్తే దాదాపు రూ. 4 లక్షలపైనే ఉండటం విశేషం. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ విషయానికి వస్తే చివరిదైన నాలుగో రోజు ఏకంగా 1052.45 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి స్టెల్లార్ రెస్పాన్స్ వచ్చింది. ఈ పోర్షన్ 1311.10 రెట్లు కోటా పూర్తయింది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ నుంచి 1668 రెట్లు, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్స్ బయ్యర్స్ నుంచి 127 రెట్లు సబ్‌స్క్రిప్షన్ జరిగింది. మొత్తం 19,60,000 షేర్లు అందుబాటులో ఉంచగా.. 2,06,28,08,000 షేర్లకు బిడ్స్ వచ్చాయి.

# ఉద్యోగులకు శుభవార్త.. త్వరలోనే డీఏ పెంపు..



కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు అదిరే శుభవార్త. 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు డియర్ నెస్ అలవెన్స్ (డీఏ) పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. జనవరి 1 నుంచి మొదలయ్యే ఆరు నెలల కాలానికి డీఏ పెంచనుంది. దీనిపై అధికారిక ప్రకటన వచ్చేది అప్పుడేనని పలు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. మరి ఈసారి ఎంత పెరగనుందనేది తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు అతి త్వరలో శుభవార్త అందనుంది. ఈ కొత్త ఏడాదికి తొలి ఆరు నెలలు అంటే జనవరి నుంచి ఆరు నెలలకు సంబంధించిన డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ), డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) పెంచేందుకు కసరత్తు మొదలెట్టింది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్. దీంతో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు భారీగా పెరగనున్నాయి. మీడియా నివేదికల ప్రకారం.. వచ్చే ఆరు నెలల కాలానికి గానూ 4 శాతం మేర డీఏ పెంపు ఉంటుందని తెలుస్తోంది. అయితే, డీఏ పెంపునకు సంబంధించిన అధికారిక ప్రకటన 2024, మార్చి నెలలో ఉండనుందని సమాచారం. మార్చిలో డీఏ పెంపు 4 శాతం మేర ప్రకటించినట్లయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డియర్‌నెస్ అలవెన్స్ 50 శాతానికి చేరుకుంటుంది. అంతకు ముందు 2023, అక్టోబర్ నెలలో డీఏ 4 శాతం మే పెంచుతూ కేంద్ర సర్కార్ నిర్ణయం తీసుకుంది. జులై 1, 2023 నుంచి అమలులోకి డీఏ 46 శాతానికి చేరుకుంది. ఇప్పుడు మరో 4 శాతం పెంచినట్లయితే 50 శాతం మార్క్ క్రాస్ కానుంది. దేశంలో ద్రవ్యోల్బణం రేటును బట్టి డీఏ, డీఆర్ పెంపును నిర్ణయిస్తుంది కేంద్రం. ఏడాదిలో రెండు సార్లు పర్సంటేజి ఆధారంగా ఈ పెంపు అనేది ఉంటుంది. సాధారణంగా ప్రతి ఏటా మార్చి, సెప్టెంబర్ నెలల్లో ఈ ప్రకటనలు ఉంటాయి. కరువు భత్యంపై సమీక్ష అనేది జనవరి 1, జులై 1 నుంచి మొదలవుతుంది. డియర్‌నెస్ అలెన్స్ కి సైతం ఇదే నియమం వర్తిస్తుంది. డీఏ లెక్కించే ఫార్ములను 2006లో సవరించింది కేంద్రం. గత ఏడాది జూన్ తో ముగిసే సమయానికి ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ప్రకారం 12 నెలల సగటు ఆధారంగా డీఏ పెంపును నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఏఐసీపీఐ అనేది 139.1 శాతానికి చేరుకుంది. ఇది ధరల పెరుగుదలను సూచిస్తోంది. అంటే ఈసారి డీఏ పెంపు గణనీయం గానే ఉండనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. డియర్‌నెస్ అలవెన్స్ అంటే దేశంలో ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉద్యోగుల కు జీతంతో పాటు అందించే కరువు భత్యం. ద్రవ్యోల్బణం పెరిగిన సందర్భంలో కరెన్సీ విలువ తగ్గి ఉద్యోగుల కొనుగోలు శక్తిని దెబ్బ తీస్తుంది. వారి వాస్తవ ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. దానిని భర్తీ చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కరువు భత్యం అందిస్తుంది. ఉద్యోగులకు డీఏ పెంచినట్లుగానే పెన్షనర్లకు డీఆర్ పెంపు ఉంటుంది. డీఏ పెంపుతో కేంద్రంలోని సుమారు 48 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. అలాగే 67 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందుతారు.

# ఆ పెన్షనర్లకు మరో ఛాన్స్..

కేంద్ర ప్రభుత్వం ఆ రంగానికి చెందిన పెన్షనర్లకు మరో అవకాశం కల్పించింది. నవంబర్‌లో తమ జీవన ప్రమాణ పత్రం (లైఫ్ సర్టిఫికెట్) సమర్పించేందుకు విధించిన గడువు ముగిసిన క్రమంలో మరోసారి పొడిగించింది. ఈనెలాఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని తెలిపింది. ఈ సందర్భంగా గడువు ఎప్పటి వరకు ఉంది, ఎలా సబ్మిట్ చేయాలి అనేది తెలుసుకుందాం.

కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లు తమకు ప్రతి నెలా సజావుగా పెన్షన్ కొనసాగాలంటే నిర్దేశిత సమయంలోపు జీవన ప్రమాణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అందుకు కొంత సమయం ఇస్తుంటారు. తాజాగా రక్షణ రంగానికి సంబంధించిన పెన్షనర్లకు కేంద్రం శుభవార్త అందించి ంది. 2023, నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పిం చాల్సి ఉన్న డిఫెన్స్ పెన్షనర్లకు మరో అవకాశం కల్పిస్తూ ఆ గడువును జనవరి 31, 2024 వరకు పొడిగించింది. అంటే ఈ నెలఖారు వరకు ఇంకా ఎవరైనా ఉంటే సమర్పించవచ్చు. ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ పెన్షన్స్ వెబ్‌సైట్ ప్రకారం.. పెన్షనర్లు నవంబర్ , 2023లో వార్షిక ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉండగా ఆ గడువును జనవరి 2024 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. జనవరి 2024 తర్వాత



ఎలాంటి ఆటంకం లేకుండా పెన్షన్ కొనసాగాలంటే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని కోరింది రక్షణ శాఖ. డిఫెన్స్ రంగానికి చెందిన పెన్షనర్లు తప్పనిసరిగా తమ వార్షిక గుర్తింపు ను ఆధార్ ద్వారా లేదా గుర్తింపు పొందిన అధికార సంస్థలు జారీ చేసిన లైఫ్ సర్టిఫికెట్ ను సమర్పించాల్సి ఉంటుంది. ఇలా చేస్తేనే వారి బ్యాంకు ఖాతాలో పెన్షన్ అనేది ప్రతి నెలా జమవుతుంది. డిఫెన్స్ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ఇప్పుడు జనవరి 31, 2024 వరకు గడువు ఉంటుంది. జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ఎలా సమర్పించాలి..ముందుగా జీవన్ ప్రమాణ సాఫ్ట్‌వేర్ డౌన్ లోడ్ చేసుకుని ఓపెన్ చేయాలి. ఆ తర్వాత పెన్షనర్ ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఓటీపీ జనరేట్ బటన్ పై క్లిక్ చేయాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసి ఓకే బటన్ పై క్లిక్ చేయాలి.న్యూ విండో ఓపెన్ అయిన తర్వాత పెన్షనర్ వివరాలు సమర్పించాలి. రిజిస్టర్డ్ పీపీఓ నంబర్ ఎంపిక చేసుకోవాలి.

# లైంగిక కోరికలు అణుచుకోవాలన్న హైకోర్టు..




టీనేజీలో ఉన్న బాలికలు లైంగిక కోరికలు అణుచుకోవాలని కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. తీర్పులోని వ్యాఖ్యలు అభ్యంతరక రంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. ఇలాంటి తీర్పులు రాయడం తీవ్రమైన తప్పిదంగా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే గతంలో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుమోటోగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. బాలికను కిడ్నాప్ చేసి.. ఓ యువకుడు లైంగిక దాడి చేసిన ఘటనకు సంబంధించి కోల్‌కతా హైకోర్టు గతంలో ఇచ్చిన సంచలనమైన తీర్పుపై తాజాగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు.. తీర్పును కొట్టివేసింది. ఈ తీర్పు రాసి వెలువరించిన జడ్జిలు.. అతి ముఖ్యమైన న్యాయ సూత్రాలను పరిగణలోకి తీసుకోలేదని తీవ్ర స్థాయిలో విమర్శలు చేసింది. ఉన్నతమైన హోదాల్లో ఉన్న న్యాయమూర్తులు ఇలాంటి సున్నితమైన అంశాలకు సంబంధించిన కేసు తీర్పుల్లో వారి సొంత అభిప్రాయాలను చొప్పించడం సరైంది కాదని తెలిపింది. టీనేజీ దశలో ఉన్న అమ్మాయిలు తమ లైంగిక వాంఛలను అణచుకోవాలంటూ కొన్ని నెలల క్రితం కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పుపై సుప్రీం కోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. అయితే ఈ కేసులో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పులోని ప్రతి వాక్యం అభ్యంతరకరంగా ఉన్నాయని పేర్కొంది. ఇలాంటి తీర్పులు రాయడం తీవ్రమైన తప్పిదంగా సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కీలకమైన న్యాయ సూత్రాలను పరిగణనలోకి తీసుకోకుండానే న్యాయమూర్తులు ఈ కేసు తీర్పు రాశారని విమర్శించింది. న్యాయం అందించాల్సిన హోదాలో ఉన్న న్యాయమూర్తులు తీర్పులకు సొంత అభిప్రాయాలను జోడించడం సబబు కాదని సూచించింది. పశ్చిమ బెంగాల్‌లో 14 ఏళ్ల బాలికను ఓ యువకుడు కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ట్రయల్ కోర్టు తీర్పును నిందితుడు కోల్‌కతా హైకోర్టులో అప్పీల్ చేశాడు. దీనిపై విచారణ జరిపిన కోల్‌కతా హైకోర్టు 2023 అక్టోబర్‌లో సంచలన తీర్పును చదివి వినిపించింది. టీనేజీ దశలో ఉన్న బాలికలు తమ లైంగిక వాంఛలను అదుపులో పెట్టుకోవాలని.. జస్టిస్ చిత్తరంజన్ దాస్, జస్టిస్ పార్థసారథి సేన్‌ల నేతృత్వంలోని హైకోర్టు డివిజన్ బెంచ్ విస్మయపరిచే తీర్పు చెప్పింది. ఆ 2 నిమిషాల సుఖం కోసం బాలికలు పరాజితులుగా మిగిలిపోకూడదని ఉచిత సలహా కూడా ఇచ్చింది. అంతటితో ఆగకుండా ట్రయల్ కోర్టు నిందితుడికి విధించిన 20 ఏళ్ల జైలు శిక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. అయితే కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ దృష్టికి రావడంతో గతేడాది డిసెంబర్ 8 వ తేదీన సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేసే ఉద్దేశం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా.. లేదా..? తెలియజేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీంతో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును పశ్చిమ బెంగాల్ సర్కారు సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై విచారణను స్వీకరించిన జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కోల్‌కతా హైకోర్టు తీర్పును పూర్తిగా తప్పుపట్టింది. ఆ తీర్పుపై తమ అభ్యంతరాన్ని వెల్లడిస్తూనే తదుపరి విచారణ జనవరి 12 వ తేదీకి వాయిదా వేసింది.

# ఈడీ అధికారులను చుట్టుముట్టి దాడి చేసిన వందల మంది స్థానికులు

పశ్చిమ్ బెంగాల్‌లో కేంద్ర దర్యాప్తు అధికారులకు భయానక అనుభవం ఎదురయ్యింది. ఓ కేసులో అధికార టీఎంసీ నేతను విచారణకు తమ కార్యాలయానికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులపై దాడికి ప్రయత్నించారు. ఒక్కసారిగా వందల మంది ఎదురొచ్చి.. కార్లను ధ్వంసం చేశారు. దీంతో బతుకుజీవుడా అంటూ అక్కడ నుంచి పారిపోయి ప్రాణాలను కాపాడుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై స్థానికులు దాడికి పాల్పడిన ఘటన పశ్చిమ్ బెంగాల్‌లో చోటుచేసుకుంది. బెంగాల్‌లో జరిగిన రేషన్ కుంభకోణంపై విచారణ సందర్భంగా ఈడీ అధికారులకు ఈ అనుభవం ఎదురయ్యింది. ఉత్తర 24 పరగణాల జిల్లాకు చెందిన టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను విచారణ తీసుకెళ్తుండగా.. తమ నేతను తీసుకెళ్తున్నారన్న కోపంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రేషన్ కుంభకోణంపై సర్బేరియా గ్రామం సహా పశ్చిమ్ బెంగాల్ వ్యాప్తంగా 18 చోట్ల ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు.

ఈ క్రమంలో టీఎంసీ నాయకుడు షాజహాన్ షేక్‌ను విచారణ నిమిత్తం ఈడీ అధికారులు సర్బేరియా గ్రామానికి చేరుకుని, అనంతరం ఆయనను ఈడీ కార్యాలయానికి తమ వాహనం తీసుకెళ్లారు. దీంతో తమ నేతను ఎలా తీసుకెళ్తారంటూ 200 మందికిపైగా స్థానికులు ఈడీ అధికారుల కార్లను చుట్టిముట్టారు. వారిలో కొందరు కర్రలు, రాళ్లతో దాడిచేసి కార్లను ధ్వంసం చేశారు. ఆ సమయంలో ఈడీ అధికారులకు భద్రతగా సీఆర్పీఎఫ్ జవాన్లు కూడా ఉన్నారు. అయినాసరే వెనక్కి తగ్గకుండా వాహనాల డోర్లను తెరిచి, అధికారులను లాగడానికి ప్రయత్నించారు. తుపాకులు, ఇతర ఆయుధాలతో దాడికి ప్రయత్నించారు. దర్యాప్తు బృందం వాహనాలు ధ్వంసం చేయగా.. ఒక అధికారి తలకు గాయమైంది.

అధికారులు, జవాన్లు చెల్లాచెదురైన బైక్‌లు, ఆటోల సాయంతో సంఘటనా స్థలం నుంచి పారిపోయి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. కాగా, ఈ ఘటనపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా మండిపడింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా ఉన్నాయనడానికి ఈ ఘటన నిదర్శనమని ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి విమర్శించారు. శాంతి భద్రతలను పరిరక్షించాలని, ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నియన డిమాండ్ చేశారు. జాతీయ దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని అన్నారు. లబ్ధిదారుల కోసం ఉద్దేశించిన ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్‌లో దాదాపు 30 శాతం బహిరంగ మార్కెట్‌కు



అక్రమంగా మళ్లించారని ఈడీ గతంలో ఆరోపిం చింది. ఈ కుంభకోణానికి సంబంధించి బెంగాల్‌లో నెలల తరబడి ఈడీ దాడులు కొనసాగు తున్నాయి.ా్రష్టంలో రైతుల పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించి పలువురు రైస్ మిల్లర్లు, కోఆపరేటివ్ సొసైటీలు మద్దతు ధరను స్వాహా చేస్తున్నారనేది ఈడీ ప్రధాన ఆరోపణ. ఇదే కేసులో గతేడాది అక్టోబర్ 14న రైస్ మిల్లు యజమాని రహ్మాన్‌ను దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. తాజాగా, ఈ కుంభకోణంతో ప్రమేయం ఉన్నట్టు అనుమానిస్తున్న టీఎంసీ నేతను విచారించడానికి ఈడీ ఆయన గ్రామానికి వెళ్లగా ఈ ఘటన చోటు చేసుకుంది.

# ఆర్థిక వృద్ధి, విదేశీ వ్యవహారాలు భేష్ అని కితాబు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై చైనా మీడియా ప్రశంసల జల్లు కురిపించింది. 10 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో భారత్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని పేర్కొంది. ఆర్థికంగా, సామాజికంగా, విదేశాంగ విధానాల్లో భారత్ గణనీయమైన ప్రగతిని సాధిస్తోందని చైనీస్ స్టేట్ మీడియా కొనియాడింది. భారత్ అన్నా, భారత ప్రధాని అన్నా ఎప్పుడూ అక్కసు వెళ్లగక్కే చైనా తాజాగా ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసలతో ముంచెత్తింది. నరేంద్ర మోదీ ప్రధాని అయిన తర్వాత ఆయన హయాంలో భారత్ గణనీయమైన ప్రగతిని సాధించిందని పేర్కొంది. షాంఘై ప్రావిన్స్‌లోని ఫుడాన్ యూనివర్శిటీలో ఉన్న సౌత్ ఏషియన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ జాంగ్ జియాడాంగ్ రాసిన ఓ స్టోరీని చైనీస్ ప్రభుత్వ మీడియా సంస్థ గ్లోబల్ టైమ్స్ తాజాగా ప్రచురించింది. ముఖ్యంగా గడిచిన 4 ఏళ్లలో భారత్ సాధించిన అద్భుత విజయాలను అందులో ప్రస్తావించింది. ఆర్థిక, సామాజిక పాలన, విదేశాంగ విధానాల్లో భారత్ గణనీయమైన ప్రగతిని సాధిస్తోందని.. అది ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఉన్నందునే సాధ్యమైందని చైనీస్ స్టేట్ మీడియా ఏజెన్సీ గ్లోబల్ టైమ్స్ ప్రశంసించింది. అభివృద్ధి చెందడంలో భారత్ వ్యూహాత్మకంగా, నమ్మకంగా, క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని అందులో వ్యాఖ్యానించింది. భారత బలమైన ఆర్థిక వృద్ధి, అర్బన్ గవర్నెన్స్ మరింత ఉన్నతంగా తీర్చిదిద్దినట్లు కొనియాడింది. అంతర్జాతీయ సంబంధాలు మరీ ముఖ్యంగా చైనాతో భారత్ తన వైఖరి మార్పును ప్రస్తావించింది. వాణిజ్యం పరంగా చైనా, భారత్ మధ్య ఉన్న అసమానతలను తగ్గించేందుకు భారత్ ఎన్నో చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించిందని పేర్కొంది. ఇక ప్రస్తుతం భారత్ తన ఎగుమతుల సామర్థ్యాలను పెంచుకునేందుకు ఎక్కువ దృష్టి పెడుతోందని వెల్లడించింది. అత్యంత వేగవంతమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధితో భారత్ వ్యూహాత్మకంగా.. నమ్మకంగా రూపొందించి అభివృద్ధి చేయడంలో భారత్ మరింత క్రియాశీలకంగా మారిందని కథనం పేర్కొంది. మరోవైపు.. రాజకీయ, సాంస్కృతిక



రంగాల్లో.. పాశ్చాత్య దేశాలతో తన ప్రజాస్వామ్య ఏకాభిప్రాయాన్ని నొక్కి చెప్పడానికి ప్రజాస్వామ్య రాజకీయాల్లో భారతీయ లక్షణాన్ని హైలైట్ చేసే స్థాయికి చేరుకుందని ప్రశంసించింది. ఇక ప్రస్తుతం ప్రజాస్వామ్య రాజకీయాల భారతీయ మూలాలపై మరింత ఎక్కువ ప్రాధాన్యత ఉందని చెప్పింది. చారిత్రక వలస రాజ్యాల నీడ నుంచి తప్పించుకోవడాని కి.. రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రపంచంలోనే విశ్వ గురుగా వ్యవహరించాలనే ఆశయాన్ని భారత్ ప్రతిబింబిస్తోందని జాంగ్ జియాడాంగ్ కథనం రాశారు. అంతర్జాతీయంగా తీవ్ర ప్రభావం చూపిన రష్యా-ఉక్రెయిన్ వివాదంలో తటస్థ వైఖరిని అవలంభిస్తూనే అమెరికా, జపాన్, రష్యా వంటి అగ్ర దేశాలతో సంబంధాలను పెంపొందించడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత విదేశాంగ విధాన వ్యూహంపై ప్రశంసలు గుప్పించింది. విదేశాంగ విధానంలో భారత్ వ్యూహాత్మక ఆలోచన మార్పుకు గురైందని.. గొప్ప శక్తి వ్యూహం వైపు కదులుతుందని చైనా మీడియా కొనియాడింది. ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి అమెరికా, జపాన్, రష్యాలతో సంబంధాలను మరింతగా ప్రోత్సహిస్తున్నరని.. భారత్ ఎల్లప్పుడూ తనను తాను ప్రపంచ శక్తిగా పరిగణిస్తోందని చెప్పింది.

# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు.జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్యం÷-ర సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళు లర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

## ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు



న్యూఢిల్లీ: నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.

## ఐపిఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు



హైదరాబాద్:తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరిని ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు. గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు. తన క్షమాపణల అనంతరం ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించాలని కౌశిక్ రెడ్డి కోరారు. అయితే ఐపీఎస్ అధికారిపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ పేర్కొంది. మతం పేరుతో ఆరోపణలు చేయడం దారుణమని చెప్పుకొచ్చింది. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న అధికారిపై వ్యక్తిగత దాడి చేశారని అసోసియేషన్ మండిపడింది. మత మార్పిడుల ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ ఘటన సివిల్ సర్వీస్ అధికారుల మనోబలాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపింది. ఎమ్మెల్యే ప్రవర్తనపై తక్షణ విచారణకు డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే నుంచి బహిరంగ క్షమాపణ కోరింది. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి మతమార్పిడికి ప్రయత్నిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అతని మతం గురించి చేసిన ఆరోపణలతో తీవ్రంగా కలత చెందుతున్నామని పేర్కొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి క్షమాపణలు తెలిపారు.

## మేడారం జాతరను సందర్శించుకున్న తలసాని

### అమ్మవార్లకు ఎమ్మెల్యే మొక్కులు


ములుగు: మేడారంలో సమ్మక్క, సారక్క జాతర వైభవంగా కొనసాగుతుంది. జాతర అమ్మవార్లను దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం మేడారం జాతరను సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క, సారక్కను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బంగారం సమర్పించి అమ్మవార్లను వేడుకున్నారు. జాతరలో మంత్రి సీతక్క ఎమ్మెల్యేను ఆపార్యంగా పలకరించారు. సీతక్క వారికి అమమవారి దర్శనం చేయించారు.

## తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదల



హైదరాబాద్:తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదలైంది. టెట్ 2026 జనవరి కీ, రెస్పాన్స్ షీట్‌లను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ నెల 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. టెట్ 'కీ'పై అభ్యంతరాలను నేటి నుంచి ఫిబ్రవరి 1న సాయంత్రం 5గంటల వరకు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. తెలంగాణ టెట్ పేపర్ 1, పేపర్ 2కు కలిపి దాదాపు 2.37లక్షల దరఖాస్తులు రాగా.. వీటిలో 71,670మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉన్నారు. మరిన్ని వివరాలను టెట్ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపింది.

## తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం



హైదరాబాద్: కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం- నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 'ఒక్క చుక్క నీరు కూడా వదులుకోం. ఢిల్లీలో జరిగిన మీటింగ్ గురించి హరీష్ రావు తెలుసుకుని మాట్లాడాలి.. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధం.. కానీ చుక్క నీరు కూడా వదులుకునేది లేదు.. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారు.

## శ్రీవారితో ఆటలాడడం మానుకోండి

అమరావతి: తిరుమల వేంకన్న స్వామితో పెట్టుకుంటే భూస్థాపితమేనని చరిత్ర చెబుతోందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ తెలిపారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడడమే గాకుండా దానిని బుకాయించే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన వైసిపి నేతలను హెచ్చరించారు. ఇప్పికే భక్తులు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ఇప్పటికే అసెంబ్లీ స్థానాలు 151 నుంచి 11కు పడిపోయిన వైసీపీకి ఇదొక ఉదాహరణ అని ఆ పార్టీ నేతలకు ఆయన గుర్తుచేశారు. ఇకనైనా దేవుడితో ఆటలాపితే వాళ్లకే మంచిదంటూ హితవు పలికారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..చేసిన మహా పాపాన్ని కప్పి పుచ్చుకునేందుకు వైసీపీ నేతలు చేస్తున్న విష ప్రచారాన్ని ప్రజలంతా చూస్తున్నారని పేర్కొన్నారు.

# స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తు

### రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా

### బావమరదికి ఫోన్ చేసి మరీ భార్యను చంపిన దుర్మార్గుడు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగర పోలీసు విభాగంలో స్వాట్ కమాండోగా పనిచేస్తున్న కాజల్ చౌధరి(27)ని ఆమె భర్త అంకుర్ డంబెల్‌తో కొట్టి చంపిన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మృతురాలి సోదరుడు నిఖిల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. హత్యకు సంబంధించిన పలు కీలక విషయాలు వెల్లడించాడు. 'హత్యకు ముందు నా సోదరి కాల్ చేసి, తన భర్త వేధిస్తున్నట్లు చెప్పింది. అదే సమయంలో అక్కడే ఉన్న అంకుర్ ఆమె నుంచి ఫోన్ లాక్కొని రికార్డు చేసి పెట్టుకో.. పోలీసులకు ఆధారంగా పనికొస్తాయి. మీ అక్కను చంపుతున్నా అని బెదిరించాడు. ఆ సమయంలో అతడిని ఎంత సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ నా మాటలు వినలేదు. కొంతసేపటి తర్వాత అంకుర్ కాల్ చేసి, కాజల్ చనిపోయిందని.. గాజియాబాద్ ఆస్పత్రికి వచ్చి చూసుకొమ్మని చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి వెళ్లగా గర్భిణి అయిన నా సోదరి మృతిచెంది ఉందని సోదరుడు నిఖిల్ బావురుమన్నాడు. 2023లో అంకుర్‌తో కాజల్ వివాహం అయిన సమయంలో పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చామని, అయినా అత్తింటివారు అదనపు కట్నం కోసం తన కుమార్తెను వేధించేవారని మృతురాలి తల్లి ఆరోపించింది. రక్షణశాఖలో క్లర్కుగా పనిచేస్తున్న అంకుర్‌కు ఆర్థికపరమైన అంశాల్లో భార్య కాజల్‌తో తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 22న దంపతుల మధ్య గొడవ తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, డంబెల్‌తో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాజల్ గాజియాబాద్ ఆసుపత్రిలో అయిదు రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం మృతి చెందగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంకుర్‌ను అరెస్టు చేసిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీలోని మోహన్ గార్డెన్ ప్రాంతంలో కాజల్-అంకుర్ నివాసంలో ఈ ఘటన జరిగింది. భర్త.. నిందితుడైన అంకుర్ తన భార్య కాజల్ తలని తలుపు ఫ్రేమ్‌కు బలంగా కొట్టి, ఆపై బరువైన డంబెల్ తో ఆమె తలపై దాడి చేశాడు. దాడి సమయంలో కాజల్ నాలుగు నెలల గర్భిణీ. ఆసుపత్రిలో ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, జనవరి 27న కమాండో కాజల్ కన్నుమూశారు. కట్నం వేధింపులే తమ బిడ్డ హత్యకు ప్రధాన కారణమని కాజల్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు అంకుర్ చౌదరి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్కుగా పనిచేస్తున్నాడు. పెళ్లిలో బుల్లెట్ బైక్, బంగారం ఇచ్చినప్పటికీ, కారు ఇవ్వలేదని అతను తరచూ కాజల్‌ను వేధించేవాడని తెలుస్తోంది. పోలీసులు.. నిందితుడు అంకుర్ చౌదరిని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపారు. ముందుగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. కాజల్ మరణం తర్వాత దానిని హత్య కేసుగా మార్చారు. కాజల్-అంకుర్ దంపతులకు ఇప్పటికే ఒకటిన్నర ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాబు కాజల్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.

## తెలంగాణలో ఏమీ సాధించుకోలేక పోయాం సమ్మక్క జాతరలో కవిత ఆవేదన



ములుగు:తెలంగాణ ఏర్పడిన తర్వాత 12 ఏండ్లలో ఏమీ సాధించుకోలేక పోయామని మాజీ ఎమ్మెల్సీ,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో వేటిని కూడా సంపూర్ణంగా సాధించుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మను ఆమె దర్శించుకున్నారు. అంతకు ముందు గట్టమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిలువెత్తు బంగారాన్ని అందించి మొక్కులు తీర్చుకున్నా రు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అమ్మవార్లు వారి జాతి కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని చెప్పారు. ఇవాళ తెలంగాణ జాతి కోసం అందరం నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. మన హక్కులను సాధించుకునేందుకు సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. తల్లుల దయతో తెలంగాణ బాగుండాలని కోరుకుంటున్నట్టు ఆమె తెలిపారు.

## వాస్తవ పరిస్థితులను బడ్జెట్ గుర్తించేనా?

ఏటేటా బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టడం, దానిపై పెద్దగా పట్టింపు లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టడం..తూతూ మంత్రంగా సాగిపోతోంది. దేశంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు రావడం లేదు. మూడో ఆర్థిక శక్తిగా ఎదగాలన్న మాటలకు చేతలకు పొంతన లేకుండా పోతోంది. నిజం చెప్పాలంటే ప్రజలను మభ్యపెట్టడబం తప్ప, వాస్తవాలను పాలకులు గ్రహించడం లేదు. ప్రపంచ ఆర్థిక మాంద్యం తరుముకు వస్తున్న వేళ దేశీయంగా దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. యువతకు చేతినండా పిన కల్పించడం, ధరలను అదుపు చేయడం, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం వంటి చర్యలను గుర్తించడం లేదు. అమెరికా వీసాల కట్టడితో మనదేశం నుంచి వెళుతున్న నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అక్కడా ఉద్యోగాల కల్పన అన్నది భ్రమగా మారింది. ప్రపంచంలో డాలర్ పతనం ప్రారంభం అయ్యింది. ఈ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ట్రంప్ సుంకాల కారణంగా మాన మార్కెట్లు కుదేలవుతున్నాయి. దీనిపైనా ముందస్తు వ్యూహం ఉండాలి. చెప్పాలంటే ప్రతికూల పరిస్థితుల్లో దేశం ముందుకు వెళ్లే ప్రయత్నాలు సాగాలి. మన ఉత్పత్తులను మనం ఉపయోగించే పరిస్థితి రావాలి. దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా వస్తూత్పత్తిని పెంచుకోవచ్చు.

ధాన్యం దిగుబబడులకు అనుగుణంగా మార్కెట్ లేదు. ఇవన్నీ కూడా బడ్జెట్‌లో ఎప్పుడూ చర్చించడం లేదు. ప్రస్తుతం అంటే ఫిబ్రవరి1న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో చర్చిస్తారా అన్నది చూడాలి. మనకున్న సహజ వనరులను, మానవనరులను ఎలా జోడించి వినియోగించుకోగలమో అన్న ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రతిపాదనలు సాగుతున్నాయి. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్నట్లు జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ఎకనామిక్ సర్వేను ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం లో భారతదేశపు ఎకానమీ 6.8 శాతం నుండి 7.2 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా వేశారు.



# వదిలేసుకున్నా

దాదాపు రెండు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో అగ్రశ్రేణి హీరోయిన్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మరోసారి వార్తల్లో నిలిచారు. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న క్యారెక్టర్లు చేస్తూ టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను ఏర్పరుచుకున్న ఈ భామ, సినిమాలకంటే ఎక్కువగా తన వ్యక్తిగత జీవితంతో తరచూ చర్చకు వస్తుంటారు. ముఖ్యంగా నటుడు విజయ్ వర్మతో సాగిన ప్రేమాయణం, ఆ తర్వాత జరిగిన బ్రేకప్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమన్నా చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊపునిచ్చాయి.

ఇండస్ట్రీలో డేటింగ్, రిలేషన్‌షిప్స్, బ్రేకప్స్ అనేవి కొత్త విషయం కాదు. కానీ హీరోయిన్‌ల విషయంలో మాత్రం ఇవి రోజుకొక కొత్త కథలా బయటకు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో తమన్నా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ప్రేమ జీవితానికి సంబంధించిన కొన్ని భావోద్వేగ విషయాలను తొలిసారి ఓపెన్‌గా షేర్ చేసుకున్నారు. తన జీవితంలో రెండుసార్లు హార్ట్ ముక్కలైందని చెప్పిన ఆమె, ఆ అనుభవాలను చాలా స్పష్టంగా వివరించారు. "నేను టీనేజ్‌లో ఉన్నప్పుడే మొదటిసారి ప్రేమలో పడ్డాను. కానీ నా లక్ష్యాలు, కెరీర్ కోసం ఆ బంధాన్ని వదులుకోవాల్సి వచ్చింది" అని ఆమె అన్నారు. అప్పట్లో కెరీర్‌కు ప్రాధాన్యం ఇవ్వడమే సరైన నిర్ణయంగా భావించానని తెలిపారు.

ఆ తర్వాత మరో వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నానని, కానీ కొంతకాలానికి అతను తనకు సరైన జోడీ కాదని అర్థమైందని తమన్నా చెప్పారు. "అలాంటి బంధంలో ఉండటం నా వ్యక్తిత్వానికి, భవిష్యత్తుకు ప్రమాదకరం అని గ్రహించి బయటకు వచ్చాను" అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 'డేంజరస్' అనే పదాన్ని ఉపయోగించడం ఇప్పుడు నెటిజన్లలో ఆసక్తిని రేపింది. ఈ మాటలు వినగానే ఆమె విజయ్ వర్మనే ఉద్దేశించిందా? అనే సందేహాలు మొదలయ్యాయి. విజయ్ వర్మతో తమన్నా ప్రేమాయణం గురించి బీటౌన్‌లో కొంతకాలంగా గట్టిగానే చర్చ జరిగింది. 'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్‌లో కలిసి నటించిన సమయంలో వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగిందని ప్రచారం జరిగింది. ఆ సిరీస్‌లోని లిప్‌లాక్, ఇంటిమేట్ సీన్స్ తర్వాత వీరు నిజజీవితంలోనూ ప్రేమలో ఉన్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈవెంట్స్‌కు కలిసి హాజరవడం, ఫోటోషూట్స్ చేయడం, పండగల సమయంలో కలిసి కనిపించడం వంటి కారణాలతో త్వరలో పెళ్లి కూడా చేసుకుంటారని చాలామంది భావించారు. కానీ అనుకోకుండా వీరి బంధానికి బ్రేక్ పడింది.

# ఖాన్సార్ మేనియా





బాహుబలి తర్వాత సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న ప్రభాస్ అభిమానులకు, ఒకే ఒక్క సినిమాతో ఆకలి తీర్చేశాడు డైరెక్టర్ ప్రశాంత్ నీల్ అదే సలార్: పార్ట్ 1 – సీజ్‌ఫైర్. డైలాగులు తక్కువ.. యాక్షన్ ఎక్కువ అయినా కూడా కటౌట్ కేవలం నిలబడితే చాలు బాక్సాఫీస్ బద్దలైపోతుందని ప్రభాస్ ఈ సినిమాతో మరోసారి ప్రూవ్ చేశాడు. సినిమా రిలీజై రెండేళ్లు దాటినా, ఇప్పటికీ ఆ ఖాన్సార్ మేనియా తగ్గలేదు. మరి అంతటి క్రేజ్ ఉన్న ఈ సినిమాకు సీక్వెల్ ఉందా? లేక ఆగిపోయిందా? గత కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో జరుగుతున్న రచ్చకు తాజాగా ఒక పోస్టర్‌తో ఫుల్ స్టాప్ పడింది. సలార్ సినిమా చివర్లో శౌర్యాంగ పర్వం అంటూ పార్ట్-2 కోసం భారీ హింట్ ఇచ్చాడు ప్రశాంత్ నీల్. దీంతో పార్ట్-2 ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశారు. సీన్ కట్ చేస్తే ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీ అయిపోయారు. అటు ప్రశాంత్ నీల్ కూడా యంగ్ టైగర్ ఎన్టీఆర్‌తో సినిమా అనౌన్స్ చేయడంతో, సలార్-2 అటకెక్కినట్టేనని ప్రచారం మొదలైంది. సోషల్ మీడియాలో నెగటివ్ వార్తలు, సినిమా ఆగిపోయిందనే రూమర్లు ప్రభాస్ అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. అందరూ ఆశలు వదిలేసుకుంటున్న సమయంలో.. హోంబలే ఫిల్మ్స్ ఒక మాస్టర్ స్ట్రోక్ ఇచ్చింది. తాజాగా హీరోయిన్ శ్రుతి హాసన్ పుట్టినరోజు సందర్భంగా ఒక స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కేవలం విష్ చేయడమే కాదు, అందులో ఆద్య క్యారెక్టర్‌ను మెన్షన్ చేస్తూ సలార్-2 త్వరలోనే సెట్స్ పైకి వెళ్తుందని హింట్ ఇచ్చేశారు. దీంతో ఇన్నాళ్ళు వచ్చిన పుకార్లన్నీ పటాపంచలైపోయాయి. ప్రభాస్ మరియు ప్రశాంత్ నీల్ కాంబో మళ్ళీ ఖాన్సార్ గడ్డపై అడుగుపెట్టబోతున్నారని అఫీషియల్‌గా కన్ఫర్మ్ అయింది.

# ఆ పండగే టార్గెట్



ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంతో గ్లోబల్ వైడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న రామ్‌చరణ్ ఆర్‌ఆర్‌ఆర్ తరువాత మాత్రం ఆ స్థాయి విజయాలను నమోదు చేయలేకపోయాడు. ఆర్‌ఆర్‌ఆర్ తరువాత వచ్చిన ఆచార్య నిరాశపరచడం, ఎన్నో ఆశలు పెట్టుకున్న గేమ్ ఛేంజర్ ఫలితం మెగాభిమానులను బాగా కలవరపరిచింది. దీంతో అందరి దృష్టి బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా మీదే పడింది. నిజానికి ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ అయినప్పుడు.. ఉప్పెన లాంటి లవ్ స్టోరీ తీసిన బుచ్చిబాబు, చరణ్‌తో ఎలాంటి సినిమా తీస్తాడో అని అందరూ సందేహించారు. కానీ, పెద్ది షాట్ బయటకి రాగానే అందరి నోళ్లు మూతపడ్డాయి. ఈసారి చరణ్‌ను మునుపెన్నడూ చూడని ఒక రా అండ్ రస్టిక్ మాస్ అవతారంలో బుచ్చిబాబు ప్రజెంట్ చేయబోతున్నాడని అందరికి అర్థమైంది. ఇక ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన చికిరి చికిరి సాంగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ పాట సోషల్ మీడియాను ఎలా షేక్ చేసిందో చూశాం.. ఆ బీట్ వింటుంటేనే థియేటర్లలో రచ్చ ఎలా ఉండబోతుందో అర్థమవుతోంది. పెద్ది సినిమాను తొలుత మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కానుకగా రిలీజ్ చేయనున్నారని మేకర్స్ తెలిపారు. సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌లో రిలీజ్ డేట పక్కాగా ఉండేలా చూసుకున్నారు. కానీ, ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. పెద్ది చెప్పిన సమయానికి రావడం లేదని తెలుస్తోంది. షూటింగ్ ఇంకా కొంత పెండింగ్ ఉండడం, దానికి తోడు.. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని బుచ్చిబాబు టీం పట్టుదలతో ఉందట. అందుకే, ఈ సమ్మర్ రేసు నుంచి తప్పుకుని.. దసరా పండగ సీజన్‌ను టార్గెట్ చేశారనే టాక్ బలంగా వినిపిస్తోంది.

ఆలస్యంగా వచ్చినా.. చరణ్ చేసే అటాక్ మాత్రం అరాచకంగా ఉండబోతోందని టాక్ నడుస్తోంది. ఒకవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో గ్రాండ్ కంబ్యాక్ ఇవ్వగా, మరోవైపు మెగాస్టార్ చిరంజీవి మన శంకరవరప్రసాద్‌గారు చిత్రంతో బాక్సాఫీస్ కింగ్ అని మరోసారి నిరూపించుకున్నారు. బాబాయ్ హిట్టు కొట్టాడు.. నాన్న బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు.. మరి అబ్బాయి రేంజ్ ఎలా ఉండాలి? పెద్దితో రామ్ చరణ్ కొట్టే దెబ్బకు సౌత్ ఇండియా మొత్తం దద్దరిల్లిపోవాల్సిందే అనే రేంజ్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సమ్మర్ అయినా, దసరా అయినా.. పెద్ది రాక బాక్సాఫీస్ దగ్గర ఒక ప్రభంజనమే సృష్టిస్తుందని మెగా ఫ్యాన్స్ చాలా ధీమాగా ఉన్నారు. మరి చరణ్ ఈసారి ఎలాంటి రికార్డులు సృష్టిస్తాడో చూడాలి.

# అనౌన్స్ చేస్తా

టాలీవుడ్ దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన 'ఓ శాంతి శాంతి శాంతిః' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆయన ప్రమోషన్స్‌లో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో హీరోయిన్ ఈషా రెబ్బాతో రిలేషన్‌పై ప్రశ్న ఎదురైంది. దీనికి స్పందించిన తరుణ్ భాస్కర్, ఈషా తనకు ఫ్రెండ్ కంటే ఎక్కువ అని వ్యాఖ్యానించారు. అయితే ఇది తన వ్యక్తిగత విషయం కావడంతో సరైన సమయం వచ్చినప్పుడు అన్నీ చెబుతానన్నారు. తన మాటల వల్ల ఎవరికైనా ఇబ్బంది కలగకూడదని జాగ్రత్తపడతానని తెలిపారు. 'ఈషా నాకు బెస్ట్ ఫ్రెండ్. ఒకరకంగా చెప్పాలంటే ఫ్రెండ్ కంటే ఎక్కువే. మా ఇద్దరి మధ్య రిలేషన్ గురించి చాలాకాలంగా ఏవేవో వార్తలు వినిపిస్తున్నాయి. మా మధ్య ఏముందో దాచాలని అనుకోవడం లేదు. నేనేదైనా చెబితే అవతలి పర్సన్ ఎఫెక్ట్ కాకూడదన్న ఉద్దేశంతోనే సైలెంట్‌గా ఉంటున్నాను. సందర్భంగా చూసి దాని గురించి స్పందిస్తా. 'ఓం శాంతి శాంతిః' జనవరి 30, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ చిత్రంలో హీరోగా నటించగా, హీరోయిన్‌గా ఈషా రెబ్బ కనిపించనుంది. ఇప్పటికే సినిమా నుంచి వచ్చిన టీజర్, పాటలు మంచి స్పందన తెచ్చుకోగా, విడుదల తేదీ దగ్గరపడటంతో మేకర్స్ ప్రమోషన్ల వేగాన్ని పెంచారు. ప్రింట్, వెబ్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా చిత్ర బృందం విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో హీరోయిన్ ఈషా రెబ్బాతో తన రిలేషన్ గురించి తరుణ్ భాస్కర్ ఓపెన్‌గా స్పందించారు.మా ఇద్దరి మధ్య ఏముందో అప్పుడే చెబుతా' అంటూ ఓపెన్ అయ్యారు తరుణ్ భాస్కర్. అయితే తమ మధ్య ఏమీ లేదని చెప్పకుండా దానిపై త్వరలోనే చెబుతా అని తరుణ్ భాస్కర్ చెప్పడం ఊహాగానాలకు మరింత ఊతమిస్తోంది. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ త్వరలోనే గుడ్‌న్యూస్ చెప్పేయండన్నా అని కామెంట్లు చేస్తున్నారు.



# సంథింగ్ స్పెషల్..



కింగ్ అక్కినేని నాగార్జున తన కెరీర్ లో మైల్ స్టోన్ మూవీకి చేరువయ్యారు. వైవిధ్యమైన సినిమాలతో, విలక్షణమైన పాత్రలతో గత మూడున్నర దశాబ్దాలుగా సినీఅభిమానులను అలరిస్తున్న ఆయన.. ప్రస్తుతం తన 100వ చిత్రంలో నటిస్తున్నారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో సెట్స్ మీదకు వెళ్లిన ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అప్డేట్ కోసం అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది.

కోలీవుడ్ డైరెక్టర్ రా. కార్తీక్ దర్శకత్వంలో 'కింగ్00' చిత్రం తెరకెక్కుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనంఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నాగార్జున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతేడాది ఎలాంటి హడావిడి లేకుండా సినిమా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కానీ మేకర్స్ సైడ్ నుంచి ఇంతవరకూ ఎలాంటి అప్డేట్ లేదు. అనౌన్స్‌మెంట్ లేకుండానే సైలెంట్ గా షూటింగ్ చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరణ జరుగుతోంది. నాగార్జునతో పాటు ఇతర ప్రధాన తారాగణం పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలను షూట్ చేస్తున్నట్లు సమాచారం.

జోనర్ ఏంటనేది క్లారిటీ లేదు కానీ.. యాక్షన్, ఎమోషన్స్ ప్రధానంగా సాగే కథతో 'కింగ్100' చిత్రం తెరకెక్కుతోందని తెలుస్తోంది. ఇప్పటివరకూ వచ్చిన సినిమాల మాదిరిగా కాకుండా, డిఫరెంట్ కాన్సెప్ట్ తో సినిమా ఉంటుందట. సంథింగ్ స్పెషల్ గా ఉంటుందని, రియలిస్టిక్ యాక్షన్ తో రూపొందుతోందని నాగ్ ఓ ఆంగ్ల మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో కథానుగుణంగా నాగార్జున మూడు గెటప్స్ లో కనిపిస్తారని, ముగ్గురు కథానాయికలు ఉంటారని టాక్ వినిపిస్తోంది. టబు స్వయంగా తన వందో సినిమాలో ఉండాలని కోరుకుందని నాగ్ తెలిపారు. 'నాట్యం' ఫేమ్ సుస్మితా భట్ లను మరో హీరోయిన్ ఎంపిక చేశారని ప్రచారం జరుగుతోంది. ఇటీవల శిర్డీ సాయిబాబాని దర్శించుకున్న నాగార్జున.. తన 100వ సినిమా ఈ ఏడాదే ఉంటుందని తెలిపారు. ఎంతో ఎగ్జైటెడ్ గా ఉన్నానని, తనకు బిగ్ మైల్ స్టోన్ మూవీ అని అన్నారు. తనను అభిమానించే వారందరికీ గుర్తుండిపోయే సినిమా అవుతుందని పేర్కొన్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమాని ఎక్కువ శాతం దసరా సీజన్ లో రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయని టాక్.

# రిటైర్‌మెంట్



సంగీత ప్రపంచాన్ని ఒక్కసారిగా షాక్‌కు గురిచేస్తూ ప్రముఖ గాయకుడు అర్జిత్ సింగ్ ప్లేబ్యాక్ సింగింగ్‌కు గుడ్‌బై చెప్పుతున్నట్లు ప్రకటించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పెట్టిన పోస్ట్‌లో అర్జిత్ ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. "ఇన్నే ళ్లుగా శ్రోతలుగా నాకు ఇంతటి ప్రేమను అందించినందుకు మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఇకపై నేను ప్లేబ్యాక్ సింగర్‌గా కొత్త ప్రాజెక్ట్స్ తీసుకోవడం లేదు. నా ప్లేబ్యాక్ జర్నీని ఇక్కడితో ముగిస్తున్నాను.

ఇది నాకు ఒక అద్భుతమైన ప్రయాణం" అంటూ ఆయన భావోద్వేగంగా రాశారు. ఈ ప్రకటనతో సంగీత అభిమానులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. పీక్ స్టేజ్‌లో ఉన్న గాయకుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక కారణం ఏంటన్నదానిపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ మొదలైంది. ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు ఎక్స్(ట్విట్టర్)లో కూడా అర్జిత్ సింగ్ కొన్ని పోస్టులు చేశారు. "దేవుడు నా పట్ల నిజంగా దయ చూపాడు. భవిష్యత్తులో నేను ఇంకా మంచి కళాకారుడిగా మారాలని కోరుకుంటున్నాను. కొన్ని పెండింగ్ కమిట్మెంట్స్ ఉన్నాయి. అవి పూర్తి చేస్తున్నాను. ఈ ఏడాదిలో అవి మీరు వినగలుగుతారు" అని స్పష్టం చేశారు.

అలాగే తన రిటైర్మెంట్ వెనుక ఒకే కారణం లేదని, చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. కొత్తదనం నేర్చుకోవాలనే తపన, ఇండస్ట్రీలోకి వస్తున్న కొత్త గాయకులకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే తాను తప్పుకుంటున్నానని అర్జిత్ క్లారిటీ ఇచ్చారు. అయితే సినిమాల్లో పాడకపోయినా, ఇండిపెండెంట్ సింగర్‌గా తన ప్రయాణం కొనసాగుతుందని కూడా పేర్కొన్నారు. అర్జిత్ సింగ్ సంగీత ప్రయాణం విషయానికి వస్తే, 2005లో 'ఫేమ్ గురుకుల్' రియాలిటీ షోతో తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ఎన్నో హిట్ పాటలు పాడి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో అర్జిత్ గాత్రానికి ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంది. 'స్వామి రారా', 'మనం', 'కేశవ', 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా', 'హుషారు', 'బ్రహ్మాస్త్ర' వంటి సినిమాల్లో ఆయన పాడిన పాటలు ఇప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయాయి. రెండు జాతీయ అవార్డులు, పద్మశ్రీ వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్న మెలోడీ కింగ్ అర్జిత్ సింగ్ ప్లేబ్యాక్ సింగింగ్‌కు గుడ్‌బై చెప్పడం సంగీత అభిమానులకు బాధ కలిగించినా, కొత్త ప్రతిభకు దారి ఇవ్వాలనే ఆయన ఆలోచనపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.